ప్రశ్న మీది.. జవాబు మాది!

ఈ ఏడాది పది స్టడీ మెటీరియల్‌లో మార్పు

ఎస్‌సీఈఆర్టీ ప్రశ్నలకు జిల్లా పరిషత్ జవాబులు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ఈ ఏడాది పదో తరగతి విద్యార్థులకిచ్చే స్టడీ మెటీరియల్‌లో మార్పులు చోటుచేసుకున్నాయి. ఎస్‌సీఈఆర్టీ (స్టేట్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్) ప్రశ్న ఇస్తుండగా, వాటి జవాబులను జిల్లా పరిషత్ అందజేస్తుంది.

యూటీఎఫ్ స్టడీ మెటీరియల్ కాకుండా..

జిల్లాలో పదో తరగతి విద్యార్థులకు పబ్లిక్ పరీక్షలు దగ్గర పడుతున్న సమయంలో స్టడీ మెటీరియల్‌ను ఇవ్వడం పరిపాటి. గడిచిన 25 ఏళ్లుగా యూటీఎఫ్ ఈ స్టడీ మెటీరియల్‌ను అందజేస్తోంది. పబ్లిక్ పరీక్షల ప్రశ్నాపత్రాలను పరిశీలించి వాటిలో తరచూ ఇచ్చిన ప్రశ్నలు, వాటికి జవాబులతో ఈ మెటీరియల్‌ను తయారుచేస్తుంది. దీన్ని పుస్తకరూపంలో విద్యార్థులకు అందజేస్తున్నారు. కొద్దిరోజుల క్రితం ఈ మెటీరియల్ పుస్తకానికి ముందుమాట రాయించడానికి విద్యాశాఖ కమిషనర్ వి.విజయరామరాజు వద్దకు ఆ సంఘ నాయకులు వెళ్లారు. దీన్ని పరిశీలించిన ఆయన ఇటువంటి మెటీరియల్‌ను విద్యాశాఖ అందజేస్తే బాగుంటుందన్న అభిప్రాయాన్ని వెల్లడించారు. ఇప్పటి వరకు విద్యాశాఖ పదో తరగతి విద్యార్థులకు ప్రణాళికలు మాత్రమే ఇచ్చేది. పబ్లిక్ పరీక్షలకు విద్యార్థులను సంసిద్ధం చేయడానికి ఏవిధమైన మెటీరియల్ ఇవ్వలేదు. తర్వాత కమిషనర్.. ఎస్‌సీఈఆర్టీలోని ఉపాధ్యాయులతో ఆరు పాఠ్యపుస్తకాలకు సంబంధించి ఒక్కో దానికి మూడు నమూనా ప్రశ్నాపత్రాలను తయారు చేయించారు. వాటిని పీడీఎఫ్ రూపంలో వాట్సాప్‌లో జిల్లా విద్యాశాఖాధికారులకు పంపారు. డీఈవో ద్వారా ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు, ఉపాధ్యాయులకు అవి చేరాయి. కాగా, కృష్ణా జిల్లాపరిషత్ కొన్నేళ్లుగా పదో తరగతి విద్యార్థులకు వివిధ పేర్లతో స్టడీ మెటీరియల్‌ను అందజేస్తోంది. అలాగే, ఈ ఏడాది స్టడీ మెటీరియల్‌ను ఇవ్వడానికి జిల్లాపరిషత్ ముందుకొచ్చింది. కానీ, ఎస్‌సీఈఆర్టీ ఇచ్చిన మెటీరియల్, జిల్లా పరిషత్ ఇవ్వబోయే మెటీరియల్ వేర్వేరుగా ఉంటే విద్యార్థులు గందరగోళంలో పడతారని విద్యాశాఖాధికారులు గుర్తించారు. ఎస్‌సీఈఆర్టీ ఇప్పటికే ప్రశ్నలతో నమూనా పత్రాలను విడుదల చేసిన కారణంగా వాటికి సమాధానాలను మెటీరియల్ రూపంలో ఇవ్వాలని జిల్లాపరిషత్ అధికారులకు విన్నవించారు. ఎస్‌సీఈఆర్టీ ఇచ్చిన ప్రశ్నలకు జిల్లాలోని పదో తరగతి బోధించే ఉపాధ్యాయులతో జవాబులు రాయించి జిల్లా పరిషత్‌కు అందజేస్తారు. వాటిని జడ్పీ అధికారులు పుస్తకరూపంలో ముద్రించి పాఠశాలలకు పంపుతారు. కృష్ణాజిల్లాలో ఈ ఏడాది పరీక్షలకు మొత్తం 20,814 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. వారిలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు 10,860 మంది ఉండగా, ప్రైవేట్ విద్యార్థులు 9,954 మంది ఉన్నారు.

ఐలూరు లంక వద్ద గతేడాది వరదకు 30 ఎకరాలకుపైగా పంట భూములు కోతకు గురై కృష్ణానదిలో కలిసిన ప్రదేశం



8లో

రైతుల గుండె ఘోష



ముగ్గురు యువకుల దుర్మరణం

» పెడన బైపాస్‌లో బైక్‌ను ఢీకొట్టిన లారీ — 6లో

ధాన్యం కొనుగోలు పరిశీలిస్తాం

» పౌర సరఫరాలశాఖ కమిషనర్ సౌరబ్ గౌర్ — 6లో

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాప్రమాణాలు మెరుగుపర్చాలి

» కలెక్టర్ డీకే బాలాజీ — 8లో



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ, చిత్రంలో హాజరైన సభ్యులు



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక, చిత్రంలో జెడ్పీ సీఈవో కన్నమనాయుడు, డిప్యూటీ సీఈవో ఆనందకుమార్, ఆర్డీవో స్వాతి

వేసవిలో తాగునీటిపై ప్రత్యేక దృష్టి

జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక

- 2025-26 జెడ్పీ బడ్జెట్ నిల్వ రూ.172.02 కోట్లు
- ఆదాయం అంచనా రూ.1300.24 కోట్లు
- సీపీజీఎఫ్ఎం అవార్డుకు కృష్ణా జిల్లా పరిషత్ ఎంపిక
- రోడ్లు, తాగునీటి సమస్యలపై సభ్యుల విజ్ఞప్తి
- ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్‌తో సాదాసీదాగా ముగిసిన సమావేశం

మచిలీపట్నం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : రానున్న వేసవిని దృష్టిలో పెట్టుకుని జిల్లాలో తాగునీటి అవసరాలు తీర్చేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక తెలిపారు. జిల్లాపరిషత్ సమావేశపు హాలులో జిల్లా పరిషత్ 2025-26 ఆర్థిక సంవత్సరం బడ్జెట్ సమావేశం జెడ్పీ చైర్‌పర్సన్ అధ్యక్షతన గురువారం జరిగింది. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉండటంతో వివిధ పథకాలపై సమీక్షలు జరపకుండా బడ్జెట్ అంచనాలకు సమావేశం ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. ఈ సందర్భంగా జెడ్పీ చైర్‌పర్సన్ హారిక మాట్లాడుతూ ఏటా తాగునీటి అవసరాల కోసం జెడ్పీ నుంచి రూ.40 కోట్లను ఖర్చు చేస్తున్నామన్నారు. ఈ ఏడాది అంతే మొత్తంలో నగదు కేటాయించామని తెలిపారు. 2024-25 సంవత్సరానికి సంబంధించి జెడ్పీ బడ్జెట్ ప్రారంభ నిల్వ రూ.172.02 కోట్లు ఉన్నట్లు చెప్పారు. అనంతరం 2025-26 సంవత్సరంలో జెడ్పీ ఆదాయం రూ.1300.24 కోట్లుగా, ముగింపు నిల్వ రూ.182.31 కోట్లుగా ఉంటుందని అంచనా వేశామని, ఈ ప్రతిపాదనలకు సమావేశం ఆమోదం తెలపాలని జెడ్పీ చైర్‌పర్సన్ కోరగా, సభ్యులు ఆమోదం తెలిపారు.

రహదారుల గుంతలైనా పూడ్చండి

జిల్లాలో రహదారుల అభివృద్ధి, డొంకరోడ్ల నిర్మాణంపై అధికారులు దృష్టి సారించాలని కోడూరు, తోట్లవల్లూరు, అవనిగడ్డ, ముదినేపల్లి, కైకలూరు, కలిదిండి జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. కోడూరు-అవనిగడ్డ రహదారిని సంవత్సరాల తరబడి అభివృద్ధి చేస్తామని చెప్పడమే తప్ప, పనులు మాత్రం చేయడంలేదన్నారు. 12 కిలోమీటర్ల మేర ఉన్న ఈ రహదారి గుంతమయంగా ఉందని, ప్రయాణికులకు నరకం కనిపిస్తుందని కోడూరు జెడ్పీటీసీ సభ్యుడు యాదవరెడ్డి వెంకట సత్యనారాయణ ఆవేదన వ్యక్తం చేశారు. అవనిగడ్డ-అశ్వారావుపాలెం మధ్య రహదారిని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తామని చెప్పి కొంతమేర చేసి సరిపెట్టారు.. అసలు ఇదేం పద్ధతి అంటూ అవనిగడ్డ జెడ్పీటీసీ సభ్యుడు చింతలపూడి లక్ష్మీనారాయణ, ఎంపీపీ తుంగల సుమతీదేవి అధికారులను నిలదీశారు. అవనిగడ్డ నియోజకవర్గంలో రహదారుల అభివృద్ధిపై ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అధికారులతో మాట్లాడినా పనులు చేయడంలేదన్నారు. తోట్లవల్లూరు, విజయవాడ రూరల్ జెడ్పీటీసీ సభ్యులు జొన్నల రామ్మోహన్‌రెడ్డి, సువర్ణరాజు మాట్లాడుతూ జిల్లాలో వివిధ రకాల నిధులతో సిమెంటు రోడ్ల నిర్మాణానికే అనుమతులు ఇస్తున్నారని, రైతులకు ఉపయోగపడే విధంగా డొంక రోడ్ల అభివృద్ధికి కూడా అనుమతులు ఇవ్వాలని కోరారు. ఉపాధి హామీ, జెడ్పీ నిధులతో డొంకరోడ్ల నిర్మాణం చేసేందుకు అవకాశం ఉన్నా అనుమతులు ఏకారణంతో ఇవ్వడం లేదని ప్రశ్నించారు. మోపిదేవి మండలంలో రోడ్లు అధ్వానంగా ఉన్నాయని, అధికారులు కాంట్రాక్టర్ల వద్ద నగదు తీసుకుని పనులు సక్రమంగా చేయించడంలేదని మోపిదేవి జెడ్పీటీసీ సభ్యుడు మెడబలిమి మల్లికార్జునరావు ఆగ్రహం వ్యక్తం చేశారు.

బెయిలీ బ్రిడ్జి వెల్డింగ్ పనుల్లో జాప్యం

మొవ్వ మండలం కాజ గ్రామం వద్ద ఐనంపూడి డ్రైనేజీపై బెయిలీ బ్రిడ్జికి కనీస మరమ్మతులు చేయడంలేదని జెడ్పీ కో-ఆప్షన్ సభ్యుడు వేమూరి పరిశుద్ధరాజు సమావేశం దృష్టికి తెచ్చారు. 15 గ్రామాల ప్రజల రాకపోకలకు ఆధారంగా ఉన్న ఈ బ్రిడ్జిపై ఉన్న రేకులకు వెల్డింగ్ పనులు కూడా చేయకుండా నెలల తరబడి జాప్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బడ్జెట్ విడుదల

మిగతా 6లో..

కొల్లేరు గ్రామాల్లో తాగునీటి ఎద్దడిని నివారించండి

కైకలూరు నియోజకవర్గంలోని ముదినేపల్లి, కలిదిండి, కైకలూరు మండలాల్లో వేసవిలో తాగునీటి ఎద్దడి తీవ్రంగా ఉంటుందని ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ అన్నారు. జెడ్పీ నుంచి నిధులు కేటాయించి వేసవిలో తాగునీటి ఇబ్బందులు లేకుండా ఆయా మండలాల్లోని తాగునీటి పథకాల ఫిల్టర్ బెడ్‌లకు త్వరితగతిన మరమ్మతులు చేయించాలని కోరారు. గతంలో పంచాయతీలకు సంబంధించిన నిధులను మళ్లించడంతో ఆర్థికపరమైన ఇబ్బందులు ఎదురయ్యాయని, ప్రస్తుతం కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలతో స్థానిక సంస్థలకు జవసత్వాలు కలుగుతున్నాయని వివరించారు.

దందాలు సాగవు!

» అలాంటివి ఉంటే చెప్పండి.. | » స్థానికులతో గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

- బుల్లెట్‌పై వెళ్లి చిరు వ్యాపారులను కలిసిన ఎమ్మెల్యే
- తన పేరు చెప్పి ఎవరైనా దందాలు సాగిస్తున్నారా అంటూ ఆరా
- దందాలు చేస్తే తన దృష్టికి తీసుకురావాలని ఫోన్ నంబర్ ఇచ్చి మరీ అభయం
- ఆంధ్రజ్యోతి కథనానికి స్పందన



గుడివాడ పట్టణ వాసులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెనిగండ్ల

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

గుడివాడ, జనవరి 30(ఆంధ్ర జ్యోతి): 'నియో జకవర్గంలో ఎవరి దందాలు సాగవు.. అలాంటివి ఉంటే వెంటనే నాకు చెప్పండి.. మీకు అండగా ఉంటా' అంటూ గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము స్థానికులకు అభయమిచ్చారు. నియోజకవర్గంలో తులసి దళం దందాలు, అక్రమ వసూళ్లపై ఆంధ్రజ్యోతి 'గుడివాడలో టీ ట్యాక్స్' శీర్షికతో ప్రత్యేక కథనం గురువారం ప్రచురించింది. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే రాము కాన్వాయ్, భద్రతా సిబ్బందిని పక్కన పెట్టి ఓ బుల్లెట్ మీద తానొక్కడే ఓ సామాన్యుడిలా ప్రజల దగ్గరకు వెళ్లారు. వ్యాపారులను కలిసి తన పేరు చెప్పి ఎవరైనా దందాలు సాగిస్తున్నారా అంటూ ఆరా తీశారు. వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఇక్కడ ఎవ్వరి దందాలు చెల్లవని, ఏదైనా ఉంటే నేరుగా తన దగ్గరకు వచ్చి ఫిర్యాదు చేయాలని, అండగా ఉంటానని అభయమిచ్చారు. తన ఫోన్ నంబర్‌ను కూడా వారికి తెలియజేశారు. ప్రజల కోసం కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని చెప్పారు. సమస్యలుంటే నేరుగా తనను సంప్రదించాలని కోరారు. పట్టణంలోని రహదారుల వెంబడి చిరువ్యాపారులు, దుకాణదారులు, టీ స్టాల్స్, హోటళ్లకు వెళ్లి ప్రజలతో మాట్లాడారు. ఈ సందర్భంగా రైతు బజారులో వినియోగదారులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అధికారులు గానీ, రాజకీయ పక్షాలు కానీ ఎక్కడైన అవినీతి, అక్రమాలకు పాల్పడితే తక్షణమే సమాచారం ఇవ్వాలని కోరారు. గుడివాడ అభివృద్ధికి ఏం కావాలో.. తానేం చేయాలో చెప్పాలని, తాను ఇక్కడే అందుబాటులో ఉన్నానని, నేరుగా తనను కలవచ్చునని వివరించారు. నియోజకవర్గ ప్రజలకు ఈ సందర్భంగా భరోసా ఇచ్చారు.

దర్శనాల దళారీ!

దుర్గగుడిలో వీఐపీ దర్శనాల ముసుగులో దందా

దుర్గమ్మ దర్శనం అంటే సామాన్యులకు ఓ ప్రహసనమే. అదే.. వీఐపీ లైన్‌లో వచ్చే భక్తులకు మాత్రం దర్శనం చాలా తేలిక. సామన్యులైతే టికెట్ కొని, గంటల తరబడి క్యూలో నిలబడి సరిగ్గా అమ్మవారిని చూసేసరికి సిబ్బంది, సెక్యూరిటీ చేయి పట్టుకుని లాగేస్తారు. అదే ఎలాంటి టికెట్ కొనకుండా ప్రధాన ఆలయం వెనుక నుంచి వచ్చిన వారిని మాత్రం రాచమర్యాదలతో అంతరాలయంలోకి ఆహ్వానిస్తారు. ఈ తతంగం మొత్తం వెనుక ఓ వ్యక్తి చక్రం తిప్పుతుండగా, అమ్మ సన్నిధిలో పవిత్రంగా ఉండాల్సిన సిబ్బంది కాసుల మత్తులో అవినీతి రాక్షసుల అవతారమెత్తుతున్నారు.

- ప్రైవేట్ వ్యక్తితో ఆలయ సిబ్బంది దోస్తీ
- దుర్గాఘాట్‌లో స్థావరం.. భక్తులతో బేరాలు
- 8 మందికి తగ్గకుండా ఉన్న భక్తులే టార్గెట్
- ఒక్కొక్కరి వద్ద నుంచి రూ.500 వసూలు
- సదరు భక్తులకు తోడుగా కొండపైకి ఓ వ్యక్తి
- స్కానింగ్ సెంటర్ వద్ద ఎనిమిది మంది భక్తులకు రెండే టికెట్లు
- మిగతా మొత్తం ప్రైవేట్ వ్యక్తి ఖాతాలోకి..
- ఆ తర్వాత సిబ్బందికి ఆన్‌లైన్ పేమెంట్
- మొత్తం 33 మంది సిబ్బందితో లావాదేవీలు



డిప్యూటీ శ్రీనివాస్



(ఆంధ్రజ్యోతి, విజయవాడ/వన్‌టౌన్): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ దర్శనానికి వస్తున్న వారిలో కొంతమంది ఎలాంటి టికెట్లు కొనరు. వారికి ప్రొటోకాల్ ఉండదు. అయినా అంతకుమించి దర్శనాలు జరుగుతుంటాయి. దీనికి ప్రధాన కారణం.. స్కానింగ్ పాయింట్ సిబ్బంది నుంచి ఆలయంలో పనిచేసే వారి వరకు దళారీలతో చెట్టాపట్టాలేసుకుని తిరగడమే. అమ్మవారి చెంత భక్తిశ్రద్ధలతో వ్యవహరించాల్సిన సిబ్బంది దళారీలతో దోస్తీ కడుతున్నారు. అనధికార దర్శనాల ద్వారా నెలకు లక్షలాది రూపాయలు వెనుకేసుకుంటున్నారు. ఆలయ సెక్యూరిటీ సిబ్బందికి పట్టుబడిన ఓ దళారీ ఫోన్‌ను పరిశీలిస్తే అందులో 60-70 మంది ఆలయ సిబ్బంది ఫోన్ నెంబర్లు ఉన్నాయి. వారితో కొంతమందితో మాట్లాడినట్టుగా డయల్ లిస్ట్ చూపిస్తోంది.

'స్కానింగ్'లో అసలు దొంగలు

అనధికారికంగా దర్శనాలు చేయిస్తున్న వ్యక్తిని దుర్గగుడి సెక్యూరిటీ సిబ్బంది రెండు రోజుల క్రితం పట్టుకున్నారు. కానూరుకు చెందిన కురిజిల్లి శ్రీనివాస్ అలియాస్ డిప్యూటీ శ్రీనివాస్ ఇంద్రకీలాద్రిపై కొన్నాళ్ల క్రితం కొబ్బరికాయల వ్యాపారం చేసేవాడు. ఈ సమయంలో ఆలయంలో పనిచేసే సిబ్బందితో పరిచయం పెంచుకున్నాడు. ఈ పరిచయాన్ని ఆలయంలో దర్శనాల కోసం ఉపయోగించుకుంటున్నాడు. కొన్ని నెలలుగా ప్రైవేట్ వ్యక్తులను పదుల సంఖ్యలో తీసుకొచ్చి ఎలాంటి టికెట్ లేకుండా వీఐపీ దర్శనాలు చేయిస్తున్నాడు. శ్రీనివాస్ దర్శనానికి పంపే వ్యక్తుల సంఖ్య పదికి తగ్గదు. ఆయన కొండపై కనిపించేది తక్కువే అయినా ఆయన పంపిన భక్తులకు మాత్రం వీఐపీకి మించిన స్థాయిలో దర్శనాలు జరుగుతాయి. ఇతనిపై ఎప్పటినుంచో నిఘా పెట్టగా, కనకదుర్గానగర్‌లో బుధవారం భక్తులను దర్శనానికి సిద్ధం చేస్తుండగా ఏఈవో జంగం శ్రీనివాస్, మరికొందరు ఉద్యోగులు అతడ్ని పట్టుకున్నారు. సెక్యూరిటీ సిబ్బంది పట్టుకుని పోలీసులకు అప్పగించారు. శ్రీనివాస్ ఫోన్‌ను పరిశీలించగా, ఆలయంలో పనిచేసే కొంతమంది సిబ్బందికి గూగుల్, ఫోన్‌పే ద్వారా నెలవారీగా వేలల్లో నగదును పంపినట్టు గుర్తించారు. మొత్తం 60-70 మంది సిబ్బంది ఫోన్ నెంబర్లు సదరు 'డిప్యూటీ' ఫోన్‌లో ఉన్నాయి. వారిలో చాలామందికి నెలవారీగా డబ్బు పంపినట్టు గూగుల్, ఫోన్‌పేల్లో స్పష్టంగా

మిగతా 6లో..

బాపూజీ మార్గం ఆదర్శనీయం

» ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ



గాంధీజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

కృష్ణలంక, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : అహింస, సత్యాగ్రహాలే ఆయుధాలుగా దేశానికి స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను అందించిన మహనీయుడు జాతిపిత మహాత్మాగాంధీ చూపిన మార్గం అందరికీ ఆదర్శనీయమని, ఆయన చూపిన మార్గంలో పయనించి రాష్ట్రం తద్వారా దేశాభివృద్ధిలో భాగస్వాములవుదామని కలెక్టర్ లక్ష్మీశ పిలుపునిచ్చారు. జాతిపిత మహాత్మాగాంధీ 77వ వర్ధంతి సందర్భంగా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో బాపూజీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జాతి సమగ్రత, ఐక్యతకు బాపూజీ అనుసరించిన మార్గం అందరికీ ఆదర్శప్రాయమన్నారు. అహింసాయుత మార్గంలో సత్యమే పరమావధిగా జీవించిన మహనీయుడు మహాత్మా గాంధీ గ్రామ స్వరాజ్యానికి బాటలు వేశారని కలెక్టర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఆర్వో ఎం.లక్ష్మీ నరసింహం, కలెక్టరేట్ ఏవో ఎస్.శ్రీనివాసరెడ్డి, వివిధ సెక్షన్ల సూపరింటెండెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు.

కొండపల్లి మున్సిపాలిటీలో అవినీతి ఆరోపణలపై విచారణ

ఇబ్రహీంపట్నం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో 2021-22 ఆర్థిక సంవత్సరంలో కొండపల్లి మున్సిపాలిటీలో అవినీతి ఆరోపణలు, నిధులు, అధికార దుర్వినియోగానికి పాల్పడిన అప్పటి అధికారులు కొండపల్లి మున్సిపల్ కమిషనర్ పర్వతనేని శ్రీధర్, అసిస్టెంట్ ఇంజనీరు సాయిగణేష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఐ.సుధాకర్ బాబులపై విచారణకు ఆదేశిస్తూ ప్రభుత్వం జీవో జారీ చేసింది. విచారణాధికారిగా విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ జోనల్ కమిషనర్ కె.ప్రభుదాస్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

ఫలించిన టీడీపీ కౌన్సిలర్ల పోరాటాలు

వైసీపీ హయాంలో కొండపల్లి మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన పర్వతనేని శ్రీధర్ అధికార పార్టీ అండతో తొలినుంచి వివాదాస్పద నిర్ణయాలు తీసుకోవడమేకాక అనేక అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్నాడని టీడీపీ కౌన్సిలర్లు ఆరోపించారు. ప్రజల సమస్యలపై కార్యాలయానికి వెళ్లిన మహిళా కౌనిలర్లపై శ్రీధర్ దురుసుగా ప్రవర్తించేవాడని, ఆగడాలు భరించలేక పోలీస్‌స్టేషన్ ఎదుట కౌన్సిలర్లు ధర్నాలు చేశారు. 2021-22 ఆర్థిక సంవత్సరానికి ఆడిట్ శాఖకు దొరకుండా రిజిస్టర్లు, ఫైళ్లను ఇవ్వకపోవడాన్ని క్యాష్ బుక్స్, అడ్వాన్స్ రిజిస్టర్లు, స్టాక్ రిజిస్టర్లు, సెక్యూరిటీ డిపాజిట్ల రిజిస్టర్లు సక్రమంగా నిర్వహించలేదని ఆడిట్‌శాఖ అప్పట్లో అధికారులకు అక్షింతలు వేసింది. 14.వ ఆర్థిక సంఘం నిధులతో తదితర నిధులు అప్పట్లో రూ.10 కోట్లకు పైగా అక్రమాలు జరిగినట్టు ఆరోపణలు వచ్చాయి. దీంతో ఆయనపై బదిలీ వేటు పడింది.

కలెక్టరేట్‌లో పీఎం సూర్యఘర్ హెల్ప్‌లైన్

కృష్ణలంక, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : ఎన్టీఆర్ జిల్లాను పునరుత్పాదక ఇంధన హబ్‌గా తీర్చిదిద్దే బృహత్తర కార్యక్రమంలో భాగంగా 6281709398 నెంబర్‌తో కలెక్టర్ కార్యాలయంలో పీఎం సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన హెల్ప్‌లైన్‌ను ఏర్పాటు చేసినట్టు కలెక్టర్ లక్ష్మీశ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పథకానికి సంబంధించి వివరాలు తెలుసుకొనేందుకు, సలహాలు సూచనలు పొందేందుకు ఈ హెల్ప్‌లైన్ నెంబర్‌ను సద్వినియోగం చేసుకోవచ్చని వెల్లడించారు.



హమాలీ కార్మిక కుటుంబసభ్యుల సంరక్షణకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించిన కోరమాండల్ సంస్థ ప్రతినిధులు

కోరమాండల్ ఉచిత వైద్యశిబిరం

కృష్ణలంక, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : కోరమాండల్ ఇంటర్నేషనల్ సంస్థ అధ్వర్యంలో హమాలీ కార్మికుల కుటుంబాలకు వైద్య శిబిరం నిర్వహించారు. తాడేపల్లిలోని కృష్ణాకెనాల్ వద్ద గురువారం హమాలీ కార్మికుల కుటుంబాల ఆరోగ్యం, సంక్షేమానికి ప్రముఖ ఎరువుల సంస్థ 'కోరమాండల్ ఇంటర్నేషనల్' విజయవాడలోని ఈఎస్ఐ, రమేష్, సెంటర్ ఫర్ ఫైట్ ఆసుపత్రుల సహకారంతో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. శిబిరంలో సుమారు 600 మంది హమాలీ కార్మికుల కుటుంబాలకు వైద్య పరీక్షలు చేశారు. వ్యవసాయ సరఫరా గొలుసులో కీలక పాత్ర పోషించే కార్మికులు తరచుగా ఆరోగ్య సవాళ్లను ఎదుర్కొంటారని, వారి ఆరోగ్యాన్ని మెరుగుపరచడానికి ఈ చొరవ రూపొందించబడిందన్నారు. కార్యక్రమంలో కోరమాండల్ సంస్థ రీజనల్ బిజినెస్ హెడ్ కెఎన్ఆర్ చక్రవర్తి, జనరల్ మేనేజర్ హెచ్ఆర్ శ్రీనివాసవర్మ, డీజీఎం సచ్చిదానందరెడ్డి, లాజిస్టిక్స్ మేనేజర్ ప్రసాద్, హెచ్ఆర్ ప్రతినిధి సుధాకర్, గాయత్రి, ఆఫీసర్ రాగేష్ తదితరులు పాల్గొన్నారు.



అనాథ ఆశ్రమంలో వృద్ధులకు భోజనం వడ్డిస్తున్న కె.రవికుమార్, పి.శేషగిరిరావు తదితరులు

ఎమ్మెల్యే బొండా జన్మదిన వేడుకలు

» అనాథ, వృద్ధుల ఆశ్రమాల్లో కేక్ కటింగ్, అన్నవితరణ

వన్‌టౌన్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బొండా ఉమామహేశ్వరరావు జన్మదిన వేడుకలు గురువారం టీడీపీ నాయకులు కాకొల్లు రవికుమార్, సాదం శ్రీనాథ్, పొన్నం శేషగిరిరావు ఆధ్వర్యంలో 64వ డివిజన్ పరిధి పాతపాడులోని అనాథ, వృద్ధుల ఆశ్రమాల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాతపాడులోని కార్నర్ స్టోన్ ఛారిటబుల్ ట్రస్ట్ వృద్ధాశ్రమంలో టీడీపీ నాయకులు వృద్ధుల సమక్షంలో కేక్ కటింగ్ చేసి, స్వీట్లు తినిపించారు. అనంతరం వృద్ధులకు అన్నవితరణ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు కాకొల్లు వరలక్ష్మి, పొన్నం లీల, కె.రాజేష్, కంకణాల బాబు, కోరాడ రమణ, తేజ, జయరాజు, డివిజన్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాష్ట్రాన్ని అప్పుల ఊబిలో ముంచిన జగన్

» ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ

మచిలీపట్నం టౌన్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రజలపై జగన్ ప్రభుత్వం రూ.10 లక్షల కోట్ల అప్పుల భారం వేసిందని మాజీ ఎంపీ, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ అన్నారు. గురువారం పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఒక్కచాన్స్ అంటే ప్రజలు అవకాశం ఇచ్చారని, రాష్ట్రాన్ని అప్పుల ఊబిలో ముంచేసి ఆర్థిక వ్యవస్థను దివాళా తీయించాడన్నారు. ఐదేళ్లలో జగన్ ప్రభుత్వం రూ.10 లక్షల కోట్లు అప్పులు చేసిందని, ఏడు నెలల్లో చంద్రబాబు ప్రభుత్వం రూ. 22వేల కోట్ల బకాయిలు చెల్లించారన్నారు. ఆరోగ్యశ్రీ, ధాన్యం, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలకు రూ. 22వేల కోట్లు చంద్రబాబు చెల్లించారన్నారు. అసమర్థుని పాలన వల్ల ఎంత నష్టపోయామో ప్రజలకు తేటతెల్లమయిందన్నారు.



లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడిన తహసీల్దార్ జాహ్నవి, వీఆర్వో రామారావు

అవినీతికి కేరాఫ్..

కంచికచర్ల తహసీల్దార్ కార్యాలయం



ఆరోపణలు ఎదుర్కొంటున్న కంచికచర్ల తహసీల్దార్ కార్యాలయం

» కాసులు ముట్టందే.. ఫైలు కదలదు
» మితిమీరిన లంచాలతో అవినీతి మరక
» ఏసీబీ దాడితో అక్రమాలు వెలుగులోకి..
» లంచం తీసుకుంటూ పట్టుబడిన తహసీల్దార్, వీఆర్వో



కాసులు ఇస్తేనే దరఖాస్తుకు మోక్షం.. లేదంటే గడువు ముగిసి దరఖాస్తు నిర్వీర్యమై పోవాల్సిందే తప్ప ఒక్కఅంగుళం కూడా ముందుకు కదలదు.. ఎవరేమనుకున్నా బేఖాతర్.. అధికార పార్టీ నాయకులైనా, ఎంత పలుకుబడి కలిగిన వారైనా కార్యాలయంలో పనులు కావాలంటే ముడుపులు ఇచ్చుకోవాల్సిందే.. సొమ్ములు ఇచ్చుకోలేని వారు కార్యాలయం చుట్టూ ఎన్ని ప్రదక్షిణలు చేసినా కనికరమనేది లేదు.. ఇక్కడ లంచం తప్ప మరో మాటకు తావు లేదంటే ఆశ్చర్యం వేయకమానదు.. ఇటీవల కాలంలో అవినీతి, అక్రమాలకు కంచికచర్ల తహసీల్దార్ కార్యాలయం చిరునామాగా మారిందన్న ఆరోపణలు బలంగా వినవస్తున్నాయి.

(కంచికచర్ల - ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి రాష్ట్ర విభజన వల్ల కంచికచర్ల ప్రాంతంలో భూముల ధరలకు రెక్కలు వచ్చాయి. రాజధాని అమరావతికి అతి సమీపంలో ఉండటంతో రూ.కోట్లలో ధరలు పలుకుతున్నాయి. భూములు, స్థల క్రయ విక్రయాలు జరుగుతున్నాయి. 'రియల్' వెంచర్లు భారీగా వెలుస్తున్నాయి. రెవెన్యూ పరంగా పట్టాదారు పాసుపుస్తకాలు, మ్యుటేషన్లు, సవరణలు, అడంగళ్, ఒన్‌బీలో పేర్ల నమోదు, ల్యాండ్ కన్వర్షన్ తదితర పనుల కోసం రైతులు, వ్యాపారులు, రియల్టర్ల తాకిడి ఎక్కువగా ఉంటుంది. దీనిని రెవెన్యూ అధికారులు అవకాశంగా మల్చుకున్నారు. ఫైసలిస్తేనే పనులు.. లేని పక్షంలో లేనిపోని కొర్రీలతో కాలయాపన చేస్తున్నారు. ఈలోగా దరఖాస్తు గడువు ముగిసిపోతుంది. మరల దరఖాస్తు చేయాల్సి వస్తున్నది. ఈ బాధలు పడలేక అధికారులు అడిగినంత ఇచ్చేందుకు రైతులు, రియల్టర్లు సిద్ధపడుతున్నారు.

లంచాలకు కేరాఫ్ అడ్రస్..

అవినీతి, అక్రమాలకు కంచికచర్ల తహసీల్దార్ కార్యాలయం చిరునామాగా మారింది. ఇక్కడ ప్రతి పనికి ఒక ధర నిర్ణయించి వసూలు చేస్తారు. సాధారణంగా మూడో కంటికి తెలియకుండ చాటుమాటుగా జరిగే లంచాల వ్యవహారం చట్టబద్ధమన్నట్టుగా తయారైంది. పలుకుబడి కలిగిన పెద్దలు, ప్రజాప్రతినిధులు సైతం లంచం ఇచ్చుకోవాల్సిందే.

- అధికారపార్టీలో ఉంటూ.. పేరొందిన ఒక సామాజిక వర్గం ప్రతినిధిగా చెలామణి అవుతు.. ఇక్కడ ముడుపులు చెల్లించుకోక తప్పలేదు. తన ఐదెకరాల పొలానికి పాసుపుస్తకం తీసుకునేందుకు దరఖాస్తు చేసి కార్యాలయం చుట్టూ తిరిగినప్పటికీ ప్రయోజనం లేకుండా పోయింది. అధికార పార్టీ అయితే ఏంటి..! చేయి తడపనిదే పని కాదంటూ కరాకండిగా చెప్పటంతో విస్తుపోయిన సదరు వ్యక్తి గత్యంతరం లేక రూ.పది వేలు లంచం సమర్పించుకున్న తర్వాత దరఖాస్తు ముందుకు కదలింది.
- హైదరాబాదులో ఉంటున్న కృష్ణా తీర గ్రామానికి చెందిన ప్రముఖుడొకరు కొద్ది రోజుల క్రితం ల్యాండ్ కన్వర్షన్ కోసం దరఖాస్తు చేశాడు. విస్తీర్ణంలో తేడా ఉంది, సర్వే చేయాల్సి వస్తుందంటూ లక్షల్లో డిమాండ్ చేయటం చర్చనీయాంశమైంది. సదరు ప్రముఖుడు, ఎమ్మెల్యే, ఇతర ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకువెళ్లినప్పటికీ దరఖాస్తుకు మోక్షం కలగలేదు.
- నియోజకవర్గంలో అధికార పార్టీలో క్రియాశీలకంగా వ్యవహరిస్తున్న నందిగామకు చెందిన నాయకుడొకరు ల్యాండ్ కన్వర్షన్ గురించి నేరుగా కార్యాలయానికి వెళ్లగా ముందుగా తమకు రూ.30 వేలు చెల్లించాలని డిమాండ్ విశేషం.
- పాసుపుస్తకం కోసం దరఖాస్తు చేసిన కునికినపాడు గ్రామానికి చెందిన ఒక యువకుడు ఒకటికి నాలుగుసార్లు తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరిగినప్పటికీ పట్టించుకోలేదు. పక్కన పడేసిన దరఖాస్తుకు రూ.ఐదువేలు ఇవ్వగానే చలనం వచ్చింది.
- దీపావళికి కంచికచర్లలో పది మంది మధిర వెళ్లే రోడ్డులో పొలంలో తాత్కాలికంగా బాణాసంచా దుకాణాలు ఏర్పాటు చేశారు. అనుమతి ఇచ్చేందుకు ఒక్కొక్క దుకాణానికి రూ.10వేలు డిమాండ్ చేయటంతో అప్పట్లో సామాజిక మాధ్యమాల్లో విస్తృత ప్రచారం సాగింది. పత్రికల్లో కూడా కథనాలు వచ్చాయి. అయినప్పటికీ దుకాణానికి రూ. ఐదు వేల వంతున సమర్పించుకోక తప్పలేదు.
- లంచాల బాగోతం గురించి ఏసీబీకి సమాచారం అందించాలని ఒక దశలో కొందరు ఉద్యోగులు నిర్ణయించుకున్నారంటే కార్యాలయంలో అవినీతి ఏస్థాయిలో వేళ్లూనుకుందో అర్థం చేసుకోవచ్చు. నాయకులకు పెద్ద మొత్తంలో డబ్బులిచ్చి వచ్చాం.. లంచం తీసుకోక ఏం చేయాలంటూ సదరు వ్యక్తులు సమర్థించుకోవటం శోచనీయం. ఏసీబీ దాడి జరగవచ్చునంటూ వారం క్రితం ఒకరు నేరుగా తహసీల్దార్ జాహ్నవిని కలిసి చెప్పినప్పటికీ పరిస్థితిలో మార్పు రాలేదు.
- పెద్ద మొత్తంలో లంచం డిమాండ్ చేయటంతో కౌలు రైతు మాగంటి కోటేశ్వరరావు ఏసీబీని ఆశ్రయించాడు. తన యజమాని పొలం వివరాలను అడంగళ్, వన్‌బీలో నమోదు చేసి, పాసుపుస్తకం ఇచ్చేందుకు తహసీల్దార్ జాహ్నవి రూ.లక్ష డిమాండ్ చేశారు. చివరకు రూ.30 వేలు ఇచ్చేందుకు ఒప్పందం కుదిరింది.

నాలుగు రోజులుగా నిఘా ఉంచి..

నాలుగు రోజుల నుంచి ఏసీబీ అధికారులు, తహసీల్దార్ జాహ్నవిపై నిఘా పెట్టారు. ఎట్టకేలకు బుధవారం రాత్రి లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడింది. ఏసీబీ దాడి సమాచారం అందగానే నందిగామ ఆర్డీవో బాలకృష్ణ ఇక్కడకు వచ్చారు. ఆమెతో పాటుగా వీఆర్వో రామారావును అరెస్టు చేసిన ఏసీబీ అధికారులు కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. రెవెన్యూ కార్యాలయంలో బాధితుడు కోటేశ్వరరావు, తహసీల్దార్, వీఆర్వోల స్టేట్‌మెంట్లను అధికారులు రికార్డు చేశారు. వారిని గురువారం విజయవాడ కోర్టులో హాజరుపర్చారు.

ఎన్నికల ప్రవర్తనా నియమావళి

పటిష్టంగా అమలు చేయండి

» పెండింగ్ ఫారం-18 దరఖాస్తులను గడువులోగా పరిష్కరించాలి
» అధికారులకు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ ఆదేశాలు



మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ

కృష్ణలంక, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి కృష్ణా-గుంటూరు జిల్లాల శాసనమండలి పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికల షెడ్యూల్‌ను ఈసీఐ విడుదల చేసిన నేపథ్యంలో జిల్లాలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి (ఎంసీసీ) పటిష్ట అమలుకు అధికారులు కృషి చేయాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ ఆదేశించారు. గురువారం కలెక్టర్ లక్ష్మీశ, ఎమ్మెల్సీ ఎన్నికలపై ఆర్డీవోలు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు తదితరులతో టెలికాన్ఫరెన్సు నిర్వహించారు. ఫిబ్రవరి 3న నోటిఫికేషన్ జారీ అవుతుందని, 10 వరకు నామినేషన్ల స్వీకరణ, 27న పోలింగ్, మార్చి 3న లెక్కింపు ఉంటుందని తెలిపారు. షెడ్యూల్ విడుదలతోనే ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చినందున ఈసీఐ మార్గదర్శకాలకు అనుగుణంగా ఎన్నికల ప్రక్రియ ముగింపు తేదీ మార్చి 8 వరకు కోడ్‌ను పకడ్బందీగా అమలుచేయాలని స్పష్టం చేశారు. ఎన్నికలను నిష్పక్షపాతంగా, ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు ఎన్నికల ప్రవర్తనా నియమావళిని తూ.చ తప్పక పాటించి సహకారం అందించేలా డివిజన్, జిల్లాస్థాయిలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించాలని సూచించారు. ఎంసీసీ నియమ నిబంధనలు, ఉల్లంఘనలపై చర్యలు తదితర అంశాలను వివరించాలన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధుల అధికారిక కార్యక్రమాలు, శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయకూడదని, పొలిటికల్ పోస్టర్లు, ఫ్లెక్సీలు, చిహ్నాలు వంటివి తొలగించాలని తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాల్లో, పబ్లిక్ ప్రాంతాల్లో రాజకీయపరమైన ఫొటోలు, పోస్టర్లు వంటివి తొలగించాలన్నారు. కోడ్ అమలుకు ప్రత్యేక బృందాలు పనిచేస్తాయన్నారు.

2024 డిసెంబరు 30 వరకు 78,238 మంది ఓటర్లు

పట్టభద్రుల నియోజకవర్గానికి సంబంధించి 2024 డిసెంబరు 30 వరకు చూస్తే ఎన్టీఆర్ జిల్లాలో 101 పోలింగ్ స్టేషన్ల పరిధిలో 45,540 మంది పురుషులు, 32,685 మంది మహిళలు, 13 మంది టీజీ ఓటర్లు మొత్తం 78,238 మంది ఓటర్లు ఉన్నట్లు వివరించారు. పట్టభద్రుల నియోజకవర్గ ఓటర్ల జాబితాలో పేరు నమోదుకు వీలుకల్పించే ఫారం-18 పెండింగ్ దరఖాస్తులను గడువులోగా పరిష్కరించాలన్నారు. ఒక పోలింగ్ స్టేషన్ పరిధిలో వెయ్యి ఓట్లు కంటే ఎక్కువగా ఉన్నట్లయితే అవసరమైన ఆగ్జలరీ పోలింగ్ బూత్‌లకు ప్రతిపాదనలు పంపాలని సూచించారు. పోలింగ్ స్టేషన్‌ల వద్ద అవసరమైన సౌకర్యాల కల్పనకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ లక్ష్మీశ ఆదేశించారు. టెలీకాన్ఫరెన్సులో విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర, డీఆర్వో ఎం.లక్ష్మీ నరసింహం, విజయవాడ ఆర్డీవో కె.చైతన్య, నందిగామ ఆర్డీఓ కె.బాలకృష్ణ, తిరువూరు ఆర్డీవో కె.మాధురి, కలెక్టరేట్ కో-ఆర్డినేషన్ సెక్షన్ సూపరింటెండెంట్ చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.



ధాన్యం కొనుగోలు వివరాలను పరిశీలిస్తున్న పౌరసరఫరాలశాఖ కమిషనర్ సౌరభ్‌గౌర్, డైరెక్టర్ మంజీర్ జిలానీ, జేసీ గీతాంజలిశర్మ

ధాన్యం కొనుగోలు పరిశీలిస్తాం

» పౌరసరఫరాలశాఖ కమిషనర్ సౌరభ్‌గౌర్
» నగదు చెల్లింపులపై రైతులతో ముఖాముఖి

హనుమాన్‌జంక్షన్‌రూరల్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : పొలాల్లో మిగిలిపోయిన ధాన్యం కొనుగోలు చేసేందుకు గల అవకాశాలను పరిశీలించి రైతులకు న్యాయం జరిగేలా చూస్తామని పౌరసరఫరాలశాఖ కమిషనర్ సౌరభ్‌గౌర్ భరోసా కల్పించారు. కానుమోలు రైతు సేవా కేంద్రాన్ని, రైస్ మిల్లు, వేలేరులోని గోడౌన్‌లను డైరెక్టర్ మంజీర్ జిలానీ, జేసీ గీతాంజలి శర్మలతో కలిసి గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కానుమోలు ఆర్బీకేకు వచ్చిన ఆయనకు కాకులపాడు, దంటగుంట్ల, తిప్పనగుంట, రంగయ్యప్పారావుపేట గ్రామాల రైతులు స్వాగతం పలికి పొలాల్లోనే ధాన్యం కుప్పలువేసి ఉన్నాయని తెలిపారు. పంట నూర్పే సమయానికి మిల్లర్ల టార్గెట్లు అయిపోయాయని చెపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చివరి ధాన్యం వరకూ కొనుగోలు చేస్తామని ప్రభుత్వం ఇచ్చిన హామీని అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని, కానుమోలు ఆర్బీకే పరిధిలో ఇంకా 60శాతం పైగా ధాన్యం కల్లాల్లోనే ఉందని రైతులు వివరించారు. కానుమోలు ఆర్బీకేలో రైతు నుంచి ధాన్యం కొనుగోలు ఎలా చేస్తున్నారంటూ ప్రశ్నించి తేమశాతం పరిశీలన నుండి మిల్లుకు తోలేందుకు ఇచ్చే రసీదుల వరకూ తనిఖీ చేశారు. అనంతరం రైతులతో ముఖాముఖి నిర్వహించారు. కల్లాల్లో మిగిలిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేసేలా రైస్ మిల్లర్లకు పెట్టిన టార్గెట్లను సడలించాలని పలువురు రైతులు కోరారు. కార్యక్రమంలో జేసీ గీతాంజలిశర్మ, డీఎం పద్మావతి, ఏఓ భవాని, తహసీల్దార్ మురళీకృష్ణ, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

పెడన బైపాస్‌లో బైక్‌ను ఢీకొట్టిన లారీ..

ముగ్గురు యువకుల దుర్మరణం



ప్రమాదం జరిగిన ప్రదేశం

పెడన, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : పెడన బైపాస్‌రోడ్డులో గురువారం సాయంత్రం లారీ, బైక్ ఢీకొన్న ఘటనలో ముగ్గురు యువకులు మృతి చెందారు. వీరిలో ఇద్దరు అక్కడికక్కడే మృతిచెందగా మరో యువకుడు ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం సాయంత్రం పెడన బైపాస్ రోడ్డులో బంటుమిల్లి వైపు వెళుతున్న మోటారు బైక్‌ను మచిలీపట్నం వైపు వెళుతున్న లారీ ఢీకొంది. బైక్‌పై ఉన్న బంటుమిల్లి మండలం అర్తమూరు దళితవాడకు చెందిన బాపట్ల విజయకుమార్ (39), పాలపర్తి శాంతరాజు (26)లు అక్కడికక్కడే మృతిచెందారు. పీతల అజయ్ (24)ను 108 అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. డీఎస్పీ సీహెచ్. రాజా, సీఐ నాగేంద్రప్రసాద్, బంటుమిల్లి ఎస్ఐ గణేష్‌కుమార్‌లు సంఘటనా స్థలంలో పరిస్థితిని సమీక్షించారు. మచిలీపట్నంలో పెయింటింగ్ పనులు పూర్తి చేసుకుని స్వగ్రామం వెళుతుండగా ప్రమాదానికి గురయ్యారు. లారీ డ్రైవర్ పుప్పాల పవన్ కుమార్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

దర్శనాల దళారీ!

(5వ పేజీ తరువాయి)

కనిపిస్తోంది. ముఖ్యంగా స్కానింగ్ విభాగంలో పనిచేసే వారికి ఈ చెల్లింపులు చేసినట్టు తెలిసింది. ఇంజనీరింగ్ విభాగంలో పదిమంది, అన్నదాన విభాగంలో ఇద్దరు అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు, మైక్ ప్రచార విభాగంలో పనిచేస్తున్న ఒక ఉద్యోగి, సమాచారం కేంద్రంలో పనిచేస్తున్న ఒకరు, ఆలయంలో పనిచేస్తున్న ఒకరు, బోయలుగా పనిచేస్తున్న వారిలో ముగ్గురు.. ఇలా మొత్తం 33 మందితో శ్రీనివాస్ లావాదేవీలు నిర్వహిస్తున్నట్లు ఫోన్‌పే ద్వారా తెలిసింది.

దుర్గాఘాట్‌లో బేరాలు

శ్రీనివాస్ ఇంద్రకీలాద్రిపై ఎక్కడా కనిపించడు. మోడల్ గెస్ట్‌హౌస్ పక్కన ఉన్న దుర్గాఘాట్ అతడి స్థావరం. కానూరు నుంచి నిత్యం ఉద్యోగి మాదిరిగా అక్కడికి వస్తాడు. దుర్గాఘాట్‌లో ఉన్న భక్తుల మధ్య తిరుగుతుంటాడు. ఎవరైనా దర్శనాల గురించి మాట్లాడుకుంటుంటే విని వారితో మాటలు కలుపుతాడు. ఎంతమంది ఉన్నా వీఐపీ దర్శనాలు చేయిస్తానని చెబుతాడు. వారి నుంచి ఎంతమంది దర్శనానికి వెళ్తారో అంతమంది నుంచి రూ.500 చొప్పున డబ్బు వసూలు చేస్తాడు. ఎంతమంది దర్శనానికి వస్తున్నారో ఆ విషయాన్ని స్కానింగ్ పాయింట్‌లో ఉన్న ఉద్యోగికి చెప్తాడు. వారు అతడి వద్దకు వెళ్లినప్పుడు స్కానింగ్ సిబ్బంది వారి చేతిలో రెండు, మూడు టికెట్లు మాత్రం చేతిలో పెట్టి ఎంతమంది ఉంటే అంతమందిని క్యూలోకి పంపుతారు. ఇదికాకుండా ఒక వ్యక్తిని భక్తులకు అప్పగించి కొండపైకి పంపుతాడు. అతడు వారిని స్కానింగ్ పాయింట్ వరకు తీసుకెళ్లి అక్కడున్న సిబ్బందికి విషయాన్ని చెబుతాడు. ఉదాహరణకు ఎనిమిది మంది భక్తులు దర్శనానికి వస్తే రెండు టికెట్లు వారి చేతిలో పెడతారు. దర్శనానికి ఎనిమిది మందిని పంపుతారు. వారి నుంచి మాత్రం రూ.4 వేలను వసూలు చేస్తారు. దేవస్థానంలో సిబ్బంది విధులకు ఓ చార్ట్ ఉంటుంది. షిఫ్ట్‌లవారీగా విధులు నిర్వర్తిస్తారు. ఈ విధులు వారానికోసారి మారుతుంటాయి. ఎవరు, ఏ వారం, ఏ షిఫ్ట్‌లో ఉన్నారో శ్రీనివాస్‌కు పూర్తి సమాచారం ఉంటుంది. దాని ప్రకారం వ్యవహారాలు చక్కబెడతాడు. ఇలా సదరు 'డిప్యూటీ' రోజుకు రూ.20 వేల వరకు వసూలు చేస్తున్నాడు. పండుగలు, పర్వదినాలు, శుక్ర, శని, ఆదివారాల్లో దుర్గఘాట్, కనకదుర్గానగర్‌లో ఈ దందాకు పాల్పడుతున్నారు.

పోలీసులకు ఫిర్యాదు

శ్రీనివాస్ దర్శనాల దందాపై ఏఈవో జంగం శ్రీనివాసరావు గురువారం వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల విచారణలో దళారీ శ్రీనివాస్‌తో దోస్తీ కట్టిన వారి బాగోతాలు వెలుగులోకి వస్తాయని సిబ్బంది అంతా భయపడిపోతున్నారు. ఆలయంలో స్కానింగ్ పాయింట్‌పై కొన్నాళ్లుగా అనేక ఆరోపణలు ఉన్నాయి. వాటికి నిదర్శనమే తాజా సంఘటన.

కొరవడిన నిఘా

ఆలయంలో దళారీలపై 'ఆంధ్రజ్యోతి' పలుమార్లు కథనాలు ప్రచురించింది. వీరంతా ఆలయంలో యథేచ్ఛగా తిరుగుతున్నప్పటికీ వన్‌టౌన్ పోలీసులు కానీ, దేవస్థానం సిబ్బంది కానీ పట్టించుకోవట్లేదు. ఇలా దేవస్థానంలో 15 మందికి పైగా దళారులు తిష్ట వేసి అనధికారికంగా భక్తులను దర్శనాలను తీసుకెళ్తున్నా ఎవరూ అడ్డుచెప్పరు. దీనివల్ల ఆలయ ఆదాయానికి భారీగా గండి పడుతోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి దళారుల బెడదకు చెక్ పెట్టాలని భక్తులు కోరుతున్నారు.

వేసవిలో తాగునీటిపై ప్రత్యేక దృష్టి

(5వ పేజీ తరువాయి)

కాలేదని, టెండర్లు రద్దయ్యాయని అధికారులు చెప్పి తప్పించుకుంటున్నారని ఆరోపించారు.

గ్రామీణ సమస్యలపై దృష్టి పెట్టండి

సమస్యలన్నీ గ్రామాల్లోనే ఉన్నాయని, ఎంపీపీలు, జెడ్పీటీసీ సభ్యులు లేవనెత్తిన సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని తిరువూరు శాసన సభ్యుడు కొలికపూడి శ్రీనివాసరావు కోరారు. ఒకసారి సభ్యులు సమావేశం దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను తదుపరి సమావేశం నాటికైనా పరిష్కరించాలన్నారు.

జెడ్పీకి సీపీజీఎఫ్ఎం అవార్డు

జిల్లా పరిషత్‌కు సంబంధించిన లెక్కలు పారదర్శకంగా చూపినందుకు గాను కమిటీ ఆన్ పబ్లిక్ అండ్ గవర్నమెంట్ ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్(సీపీజీఎఫ్ఎం) 2024-25 ఆర్థిక సంవత్సరానికి కృష్ణా జిల్లా పరిషత్‌ను ఉత్తమ జిల్లా పరిషత్‌గా ఎంపిక చేసినట్లు జిల్లా పరిషత్ సీఈవో కన్నమనాయుడు తెలిపారు. ఫిబ్రవరి 1వ తేదీన ఢిల్లీలోని యశోభూమి కన్వెన్షన్ సెంటర్‌లో జరిగే కార్యక్రమంలో ఈ అవార్డును ప్రదానం చేస్తారని చెప్పారు. ఈ సమావేశంలో జెడ్పీ డిప్యూటీ సీఈవో ఆనందకుమార్, ఆర్డీవో కె.స్వాతి పాల్గొన్నారు. తొలుత మహాత్మాగాంధీ వర్ధంతిని పురస్కరించుకుని గాంధీజీ చిత్రపటానికి సభ్యులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఎమ్మెల్యే చింతమనేనిపై చర్యలు తీసుకోండి

» పోలీసు స్టేషన్ ఎదుట జనసైనికుల ఆందోళన



త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ ఎదుట ధర్నా చేస్తున్న జనసేన నాయకులు

ఏలూరు క్రైం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : జనసేన పార్టీ నూజివీడు మండలాధ్యక్షుడు యర్రంశెట్టి రాముపై దాడి చేసిన దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని అనుచరులపై చర్యలు తీసుకోవాలని ఏలూరు త్రీటౌన్ పోలీస్ స్టేషన్ వద్ద గురువారం జనసైనికులు ఆందోళన చేపట్టారు. ఫిర్యాదు ఇచ్చి మూడ్రోజులు కావొస్తున్నా చర్యలెందుకు తీసుకోలేదంటూ పోలీసులను ప్రశ్నించారు. త్రీటౌన్ స్టేషన్ ఎదుట కొంత సేపు బైఠాయించి నిరసన తెలిపారు. ఉమ్మడి కృష్ణాజిల్లా జనసేన అధికార ప్రతినిధి శివరామకృష్ణ మాట్లాడుతూ, ఈ నెల 28న దుగ్గిరాలలో జనసేన పార్టీ నూజివీడు మండల అధ్యక్షుడు యర్రంశెట్టి రాముపై దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అనుచరులు దాడి చేశారన్నారు. కూటమి ప్రభుత్వంలో చింతమనేని అరాచకాలు పెరిగాయన్నారు. బాధితుడు రాము మాట్లాడుతూ, 2014 నుంచి దుగ్గిరాల సమీపంలో పొలంలో కౌలుకు వ్యవసాయం చేస్తున్నానని, ఈ నెల 28న చెరుకు నరికిస్తుంటే చింతమనేని అనుచరులు అక్కడకు వచ్చి కూలీలను బెదిరించారని, చింతమనేనిపై పోస్టులు పెడతావా అంటూ తనపై దాడి చేశారని, ఫోన్, డబ్బు లాక్కున్నారని వాపోయాడు. ఈ విషయమై మూడ్రోజుల క్రితం త్రీ టౌన్‌లో ఫిర్యాదు చేసినా ఇంత వరకూ పట్టించుకోలేదని ఇప్పటికైనా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. యర్రంశెట్టి రాము ఫిర్యాదు మేరకు చింతమనేని గోపీ, వడ్లపట్ల బాబు, మధు, మరో ఇద్దరిపై ఏలూరు త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. దుగ్గిరాల గ్రామ వీఆర్వో తిరువీధుల శ్రీనివాసరావు ఫిర్యాదు మేరకు యర్రంశెట్టి రాముపై కేసు నమోదు చేసి త్రీటౌన్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు.


మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేస్తున్న తహసీల్దార్ సురేష్‌కుమార్

మధ్యాహ్న భోజనం రుచిగా ఉండాలి

ఉయ్యూరు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): పాఠశాలలో విద్యార్థులకు పెట్టే మధ్యాహ్న భోజనం రుచిగా, శుభ్రంగా ఉండాలని తహసీల్దార్ ఎం.సురేశ్‌కుమార్ సూచించారు. రెండో వార్డులో ఎంపీపీ ప్రాథమిక పాఠశాల, జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం మధ్యాహ్న భోజనాన్ని ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులతో కలిసి ఆయన భోజనం రుచిచూశారు. వ ంటశాల, ఆహారం పరిశుభ్రంగా ఉండాలని ఆదేశించారు.

జగన్ పాలనంతా ఆర్థిక అరాచకం

● రూ.8 లక్షల కోట్ల ప్రజాధనాన్ని కొల్లగొట్టారు ● కూటమి ప్రభుత్వంపై ఏడాదికి రూ.71వేల కోట్ల భారం ● ఎమ్మెల్యే బోడె ప్రసాద్ ధ్వజం

పెనమలూరు, జనవరి 30(ఆంధ్రజ్యోతి): 'ఐదేళ్ల వైసీపీ పాలనలో జగన్‌రెడ్డి ఆర్థిక అరాచకాన్ని సృష్టించారు. రాష్ట్రాన్ని అధోగతి పాల్జేశాడు. కూటమి ప్రభుత్వంపై జగన్‌రెడ్డి దోపిడీ ప్రభావం తీవ్రంగా ఉంది. గత వైసీపీ ప్రభుత్వంలో చేసిన లక్షల కోట్ల అప్పులన్నీ వైసీపీ నాయకులు, జగన్ కుటుంబ విలాసాలకే ఖర్చు చేశారు.' అని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం పోరంకి టీడీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

'గత వైసీపీ ప్రభుత్వం రూ.10 లక్షల కోట్లు అప్పు చేసింది. దీని వల్ల కూటమి ప్రభుత్వం అసలు, వడ్డీ కలిపి ఏడాదికి రూ.71వేల కోట్ల చెల్లింపులు చేస్తోంది. దీంతో ఆర్థిక వ్యవస్థ దివాళా తీసింది. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక ఏడు నెలల్లో ఆరోగ్యశ్రీ, ధాన్యం బకాయిలు, ఫీజు రీయింబర్సుమెంటు లాంటి జగన్ ప్రభుత్వ బకాయిలు రూ.22వేల కోట్లను చెల్లించింది. గతంలో ఏ ప్రభుత్వం పెట్టని విధంగా రూ.1.40 లక్షల కోట్ల బకాయిలను జగన్ ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టింది. ఉద్యోగులకు రూ.20వేల కోట్ల బకాయిలు, ఇరిగేషన్ కాంట్రాక్టర్లకు రూ.19వేల కోట్ల బకాయిలు పేరుకుపోయాయి. జగన్‌రెడ్డి విలాసాలు, జల్సాలకు రూ.20వేల కోట్ల ప్రభుత్వ ధనాన్ని దుబారా చేశారు. సెంటు పట్టాల పేరుతో


విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్

రూ.7 వేల కోట్లు, రేషన్ బియ్యం దోపిడీలో రూ.7 వేల కోట్లు, సచివాలయాలకు వైసీపీ రంగులు వేయడానికి రూ.3 వేల కోట్లు, తాడేపల్లి ప్యాలెస్ సెక్యూరిటీకి వెయ్యి కోట్లు, సర్వేరాళ్లపై జగన్ ఫొటోలకు ఏడువందల కోట్లు, రుషికొండపై విలాసవంతమయిన భవన నిర్మాణానికి రూ.600 కోట్లు దుబారా చేసి ప్రభుత్వ ఖజానాను దోచుకున్నారు.

ఐదేళ్ల అధికారాన్ని అడ్డం పెట్టుకుని రూ.8లక్షల కోట్ల ప్రజాధనాన్ని జగన్‌రెడ్డి కొల్లగొట్టారు. లిక్కర్‌పై కమీషన్ల రూపంలోనే రూ.లక్ష కోట్లు వెనకేసుకున్నారు. విశాఖ భూముల కుంభకోణం, టీడీఆర్ బాండ్ల కుంభకోణం, ఇసుక దోపిడీ, ఎర్రచందనం దోపిడీ..ఏ రంగం చూసినా జగన్‌రెడ్డి దోపిడీ స్పష్టంగా కనిపిస్తోంది. జగన్ పత్రికకు ప్రకటనల రూపంలో రూ.1600 కోట్ల దోపిడీ జరిగింది. గ్రావెల్, సిలికా, గంజాయి, డ్రగ్స్, భారతీసిమెంటు, కొవిడ్ మందులు, కిట్లు, స్మార్ట్ మీటర్లు, విద్యార్థులకు ట్యాబులు, నాడు-నేడు..ప్రతి రంగంలో జగన్ దోపిడీ ప్రస్ఫుటమవుతోంది.' అని బోడె ప్రసాద్ ఆరోపించారు. టీడీపీ సీనియర్ నాయకుడు అనుమోలు ప్రభాకరరావు, పార్టీ పెనమలూరు మండలాధ్యక్షుడు కోయ ఆనంద్‌ప్రసాద్, పీతా గోపీచంద్, బోడె సురేంద్ర పాల్గొన్నారు.

పెద్దిరెడ్డి భూ దోపిడీపై విచారణ జరపాలి

కంకిపాడు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామ చంద్రారెడ్డి భూ దోపిడీపై విచారణ చేపట్టాలని మాజీ ఎంపీపీ దేవినేని రాజా డిమాండ్ చేశారు. స్థానిక విలేకరులతో గురువారం ఆయన మాట్లాడారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో పార్టీ నాయకులు, ఎమ్మెల్యేలు, మంత్రులు అడ్డగోలు దోపిడీకి పాల్పడ్డారని ఆయన ఆరోపించారు. మంత్రిగా అధికారాన్ని అడ్డుపెట్టుకుని అడవులను అడ్డగోలుగా పెద్దిరెడ్డి ఆక్రమించేశారన్నారు. వైసీపీ నాయకులు ఆక్రమించిన అడవులను వారి చేతుల్లో నుంచి విడిపించాలని ప్రభుత్వాన్ని కోరారు.



మండల యువమోర్చా అధ్యక్షుడిగా మురళీకృష్ణ

కంకిపాడు, జనవరి 30(ఆంధ్రజ్యోతి): యువమోర్చా మండల అధ్యక్షుడిగా ఉప్పద్రష్ట మురళీకృష్ణను ఆ పార్టీ పెనమలూరు నియోజకవర్గ కో-కన్వీనర్ దివి రోహిణీకుమార్, మండల అధ్యక్షుడు గొల్లపూడి శ్రీనివాసరావు నియమించారు. గురువారం విలేకరులతో మురళీకృష్ణ మాట్లాడారు. యువతకు అందుబాటులో ఉంటూ పార్టీ బలోపేతానికి తనవంతు కృషిచేస్తానన్నారు. నామినేటెడ్ పోస్టుల్లో బీజేపీని టీడీపీ గుర్తించటం లేదని ఆయన అన్నారు. ఒకటి రెండు రోజుల్లో ఎమ్మెల్యే బోడె ప్రసాద్‌ను కలిసి బీజేపీకి సముచిత స్థానం కల్పించాలని కోరతామని తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

ఉయ్యూరు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ముదునూరులో పేకాట ఆడుతున్న 13 మందిని అరెస్టుచేసి వారి నుంచి రూ.13,850 స్వాధీనపరుచుకున్నట్టు రూరల్ పోలీసులు తెలిపారు. బుధవారం అర్ధరాత్రి ఎస్సీ కాలనీకి వెళ్లే దారిలో పేకాట ఆడుతున్నట్టు సమాచారం రావడంతో శిబిరంపై దాడిచేసినట్టు వారు తెలిపారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం 2న

గన్నవరం, జనవరి 30(ఆంధ్రజ్యోతి): గనవరం బాలుర ఉన్నత పాఠశాల 1984-85 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఫిబ్రవరి 2న పాఠశాల ఆవరణలో జరుగుతుందని కమిటీ నాయకుడు కస్తూరి అప్పారావు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆనాటి గురువులను సత్కరిస్తామని తెలిపారు.



కోదండరామస్వామి విగ్రహ ప్రతిష్ఠ 13న

పెనమలూరు, జనవరి 30(ఆంధ్రజ్యోతి): పోరంకిలో వందేళ్ల చరిత్ర కలిగిన కోదండరామస్వామి ఆలయంలో ఫిబ్రవరి 13న విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు. ఫిబ్రవరి 9 నుంచి 13 వరకు రో జూ విష్ణు సహస్ర పారాయణం, హోమా లు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని తెలిపారు. 13న విగ్రహ ప్రతిష్ఠతో పాటు పదివేల మందికి అన్న ప్రసాదాల పంపిణీ ఉం టుందని తెలిపారు. కమిటీ అధ్యక్షుడు కర్లపూడి సుబ్బారావు, సెక్రటరీలు కనకమేడల రమణ, తాతినేని సదాశివరావు, ఆర్గనైజింగ్ కార్యదర్శి దోనవల్లి వెంకటసుబ్బారావు గ్రామ పెద్దలు ప్రతాప్, అనుమోలు ప్రకాశరావు, పాండురంగారావు పాల్గొన్నారు.

దాసాంజనేయస్వామి ఆలయంలో పూజలు

హనుమాన్‌జంక్షన్, జనవరి 30(ఆంధ్రజ్యోతి): బాపులపాడు దాసాంజనేయస్వామి ఆలయంలో ఫిబ్రవరి 2న ధ్వజస్తంభ ప్రతిష్ఠా మహోత్సవం సందర్భంగా గురువారం నుంచి ప్రత్యేక పూజలు ప్రారంభించారు. పుణ్యాహవచనం, పంచగవ్య ప్రాసన, రుత్విగ్వరణం, అంకురారోపణ నిర్వహించారు. మారేపల్లి శ్రీనివాసాచార్యులు పర్యవేక్షణలో నరసింహాచార్యులు, వేదాల వేంకటాచార్యులు బృందం పూజా కార్యక్రమాలను నిర్వహించారు.


గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు, జంక్షన్ ఆర్య వైశ్య కల్యాణ మండపం, రేమల్లె హైస్కూల్, ఉయ్యూరు ఎంపీడీవో కార్యాలయం వద్ద గాంధీకి నివాళి

మహాత్మాగాంధీ ఆశయ సాధనకు కృషి

ప్రసాదంపాడు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): 'సత్యం, అహింస ఆయుధాలుగా దేశానికి స్వాతంత్ర్య సముపార్జించిన మహనీయుడు మహాత్మ గాంధీ. ఆయన ఆశయ సాధన కోసం అందరం కృషిచేద్దాం. గాంధీ ఆశయాలను, ఆలోచనలను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలి.' అని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు.

విజయవాడలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మహాత్మాగాంధీ వర్ధంతిని నిర్వహించారు. గాంధీ చిత్రపటానికి యార్లగడ్డ వెంకట్రావు నివాళులర్పించారు.

ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో..

హనుమాన్‌జంక్షన్: ఏలూరు రోడ్డులోని ఆర్యవైశ్య కల్యాణ మండపంలోని గాంధీ విగ్రహానికి ఆర్యవైశ్య సంఘం నాయకులు నివాళులర్పించారు. బాపులపాడు మండల ఆర్య వైశ్య సంఘం అధ్యక్షుడు కొనకళ్ల రాజశేఖర్, సంఘం నేతలు పాల్గొన్నారు. బాపులపాడు మండల పరిషత కార్యాలయంలో గాంధీ చిత్రపటానికి ఎంపీడీవో కె.జోగేశ్వరరావు నివాళులర్పించారు. కార్యాలయ ఏవో త్రినాథరావు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పెరికీడు, రేమల్లెలో..

హనుమాన్‌జంక్షన్‌రూరల్ : పెరికీడులో వంతెన వద్ద గాంధీ విగ్రహానికి ఎంపీటీసీ మాజీ సభ్యుడు వేగిరెడ్డి పాపారావు, ముచ్చర్ల గిరిబాబు నివాళులర్పించారు. రేమల్లె హైస్కూల్‌లో గాంధీ విగ్రహానికి హెచ్ఎం లూథర్‌పాల్ నివాళులర్పించారు.

ఉయ్యూరులో...

ఉయ్యూరు: ఎంపీడీవో కార్యాలయంలో గాంధీ చిత్రపటానికి ఎంపీడీవో శేషగిరిరావు నివాళులర్పించారు. ఏజీ అండ్ ఎస్జీఎస్ కళాశాల వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గాంధీ చిత్రపటానికి అధ్యక్ష, కార్యదర్శులు సత్తార్, పూర్ణ నివాళులర్పించారు. ఉ య్యూరు వాకర్స్ అధ్వర్యంలో అసోసియేషన్ అధ్యక్షుడు కోడె సాంబశివరావు, కార్యవర్గ సభ్యులు గాంధీ చిత్రపటానికి నివాళులర్పించారు.


బాపులపాడు జడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులతో మాట్లాడుతున్న డీవైఈవో పద్మరాణి

ఉత్తమ ఫలితాలు సాధించాలి

హనుమాన్‌జంక్షన్, జనవరి 30(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించడానికి ప్రతి ఉపాధ్యాయుడు కృషి చేయాలని ఉపాధ్యాయులను గుడివాడ డీవైఈవో వై.పద్మరాణి ఆదేశించారు. గురువారం బాపులపాడు హైస్కూల్‌ను ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. పదో తరగతి విద్యార్థులతో మాట్లాడారు. గతేడాది కంటే మెరుగైన ఫలితాలను రాబట్టడానికి మోడల్ ప్రశ్నపత్రాలను ప్రాక్టీస్ చేయించాలని హెచ్ఎం టీవీ నాగేశ్వరరావుకు సూచించారు. దస్తూరిలో మంచి ప్రతిభ కనబరుస్తున్న 6వ తరగతి విద్యార్థినులు వాణి, అబిదాలను అభినందించారు.


ఆకునూరులో కుష్ఠు నివారణ ప్రతిజ్ఞ

కుష్ఠుపై అవగాన అవసరం


ఉయ్యూరు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ఆకునూరు పంచాయతీ కార్యాలయంలో గురువారం వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కుష్ఠు వ్యాధిపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. బాక్టీరియా వల్ల కుష్ఠు వస్తుందని, లక్షణాలను సులభంగా గుర్తించవచ్చని, చర్మంపై స్పర్శలేని మచ్చలు ఉంటే ఆరోగ్య కేంద్రంలో పరీక్షచేయించుకుని చికిత్స పొందొచ్చని సిబ్బంది సూచించారు. ప్రతిజ్ఞ చేయించారు. సర్పంచ్ గోలి వసంతకుమార్, ఏఎన్ఎం పార్వతి పాల్గొన్నారు.


ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావును సన్మానిస్తున్న ఆలయ కమిటీ పెద్దలు

శాంతి సామరస్యాలు పెంపొందించేందుకు ఆధ్యాత్మిక కార్యక్రమాలు దోహదం

● ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

ఉంగుటూరు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): సమాజంలో శాంతి సామరస్యాలు పెంపొందించేందుకు ఆధ్యాత్మిక కార్యక్రమాలు దోహదం చేస్తాయని ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. ఇందుపల్లిలో విఘ్నేశ్వర, దత్తాత్రేయ సహిత షిరిడీ సాయి బాబా ఆలయ 24వ వార్షిక మహోత్సవం వైభవంగా నిర్వహిం చారు. బుధవారం రాత్రి యార్లగడ్డ వెంకట్రావు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కూటమి నేతల సమక్షంలో ఆలయ కమిటీ పెద్దలు, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావుతోపాటు టీడీపీ రాష్ట్రకార్యనిర్వాహక కార్యదర్శి బచ్చుల సుబ్రహ్మణ్యం(బోసు), జనసేన పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త చలమలశెట్టి రమేష్‌ను సన్మానించారు.



బాలయేసు తిరునాళ్లకు ఏర్పాట్లు పూర్తి

హనుమాన్‌జంక్షన్‌రూరల్, జనవరి 30(ఆంధ్రజ్యోతి): పెరికీడులో శుక్రవారం నుంచి నిర్వహించే అద్భుత బాలయేసు మహోత్సవాలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. బాలయేసు ప్రాంగణం విద్యుత్ వెలుగులతో కాంతులీనుతోంది. నవదిన ప్రార్థనల చివరిరోజు గురువారం నూజివీడు అంబ్రోస్ మైనర్ సెమినరీ రెక్టర్ ఫాదర్ పెయ్యల మరియదాసు ప్రత్యేక బలిపూజలో పాల్గొన్నారు. భక్తులు పాల్గొనాలని విచారణ గురువు ఫాదర్ చేబ్రోలు జోసఫ్‌తంబి సూచించారు.


ప్రభుత్వ ఆస్పత్రికి సిమెంట్ బెంచీలు అందజేస్తున్న మానవతా సంస్థ ప్రతినిధులు

సమాజాభివృద్ధికి 'మానవత-2 కృషి

గన్నవరం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): సమాజాభివృద్ధిలో మానవత స్వచ్ఛంద సంస్థ విశేష కృషి చేస్తోందని ఆ సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు మారుబోయిన కోటేశ్వరరావు తెలిపారు. సామాజిక ఆరోగ్య కేంద్రానికి రోగులు, ప్రజలు కూర్చునేందుకు పది సిమెంట్ బెంచీలను గురువారం ఆయన అందజేశారు. రూ.40వేలు విలువైన బెంచీలను అందజేసినట్లు మండల అధ్యక్షుడు మడుపల్లి బాలకృష్ణమూర్తి తెలిపారు. కార్యదర్శి నర్రా వరప్రసాద్, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్లు దేవినేని సులోచనరాణి, బుస్సే నాగప్రసాద్, డాక్టర్ శారమ్మ, వ్యాక్సిన్ సెంటర్ అధికారి దేవానంద్, మోటమర్రి శేఖర్, ముక్కామల సుబ్బారావు, పొట్లూరి రామకృష్ణారావు, వీసం ప్రసాదరావు, పలగాని శివాజీ, దోనవల్లి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శుల సంఘం మండల కమిటీ ఏకగ్రీవం

హనుమాన్‌జంక్షన్, జనవరి 30(ఆంధ్రజ్యోతి): పంచాయతీ కార్యదర్శుల సంఘం బాపులపాడు మండల కమిటీని గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా చాగంటిపాటి ఆంజనేయులు(మడిచర్ల), ప్రధాన కార్యదర్శిగా పి. సురేష్(ఆరుగొలను), ఉపాధ్యక్షులుగా కె.శ్రీనివాసరావు, బి.స్వాతి, కోశాధికారిగా అంజనాదేవిని ఎన్నుకున్నారు. ఎంపీడీవో జోగేశ్వరరావు, ఈవోపీఆర్డీ లక్ష్మయ్యను నూతన కమిటీ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు.

ఫ్లెక్సీల తొలగింపు

కంకిపాడు: ఎమ్మెల్సీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కావడంతో జిల్లాలో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. దీంతో మండలంలో వివిధ పార్టీలు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను పంచాయతీ సిబ్బంది గురువారం తొలగించారు. రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగు కప్పారు.

ప్రశాంత ఎన్నికకు సహకరించండి

ఉయ్యూరు, జనవరి 30(ఆంధ్రజ్యోతి) : కృష్ణా-గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీ ఎన్నికను ఫిబ్రవరి 27న ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని పార్టీల నాయకులు సహకరించాలని తహసీల్దార్ సురేశ్‌కుమార్ కోరారు. ఎమ్మెల్సీ ఎన్నికలను పురస్కరించుకుని మండల పరిధిలోని అన్ని రాజకీయ పార్టీల నాయకులతో గురువారం ఆయన సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో శేషగిరిరావు, నగరపంచాయతీ కమిషనర్ వెంకటేశ్వరరావు, పట్టణ ఎస్సై విశ్వనాథ్ పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల తనిఖీ

జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో మూడు పోలింగ్ కేంద్రాలను గురువారం తహసీల్దార్ పరిశీలించారు. కేంద్రాలవద్ద మౌలిక వసతులు, లైటింగ్ పరిశీలించారు. ఎంపీడీవో శేషగిరిరావు, ఉయ్యూరు కమిషనర్ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం

ఉంగుటూరు: ఎమ్మెల్సీ ఎన్నికలకు పోలింగ్ కేంద్రాలను సిద్ధంచేయటంతోపాటు, ఎన్నికల నిర్వహణ ప్రక్రియ సజావుగా జరిగేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తహసీల్దార్ జె.విమలకుమారి తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికలకు ఉంగుటూరు జడ్పీహైస్కూల్‌లో ఏర్పాటుచేసిన రెండు పోలింగ్ కేంద్రాలను గురువారం ఆమె స్థానిక అధికారులతో కలిసి పరిశీలించారు. మండలవ్యాప్తంగా 645మంది పురుషులు, 477మంది స్త్రీలు, మొత్తం 1122మంది పట్టభద్రులు తమ ఓటుహక్కును వినియోగించుకోనున్నారన్నారు. ఎన్నికలకు సంబంధించి ప్రవర్తనా నియమావళి(మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్) మార్చి 8వతేదీవరకు అమలులో ఉంటుందని తెలిపారు. ఈవోపీఆర్డీ వి.దిలీప్‌కుమార్, ఎస్సై యు.గోవిందు, హెచ్ఎం సీహెచ్ అనిత, వీఆర్వో ఎస్.రామారావు, డిజిటల్‌అసిస్టెంట్ శ్యామ్ పాల్గొన్నారు.

మూడు పోలింగ్ బూత్‌లు ఏర్పాటు

హనుమాన్‌జంక్షన్: బాపులపాడు జడ్పీ హైస్కూల్‌లో ఎమ్మెల్సీ ఎన్నికల కోసం ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో మూడు బూత్‌లను తహసీల్దార్ బి.మురళీకృష్ణ పరిశీలించారు. పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లు చేయాలని రెవెన్యూ సిబ్బందిని ఆయన ఆదేశించారు. తాగునీరు, విద్యుత్, ఇంటర్‌నెట్ సౌకర్యాలపై హెచ్ఎం నాగేశ్వరరావుతో సమీక్షించారు. మండలంలో ఎమ్మెల్సీ ఎన్నికలకు 2,636 మంది పట్టభద్రులు ఓటు నమోదు చేసుకున్నారని, ఓటర్ల జాబితా విడుదలైందని ఆయన తెలిపారు. ఎంపీడీవో ఏవో త్రినాథ్, ఏఎస్సై పెద్దిరాజు ఉన్నారు.

పంట పొలాలు కోత రైతుల గుండె ఘోష

కృష్ణానదిలో వరదలకు వందల ఎకరాల్లో పంట భూముల కోత


పొలం మధ్యలో ఉండాల్సిన బోరు, మోటారు నదిలోకి జారిపోయిందని చూపుతున్న రైతు


పంటపొలం నుంచి నదిలోకి కొట్టుకొచ్చిన మోటారు, వరలు


ములకలపల్లిలంక వద్ద కృష్ణానది వరదకు కోతకు గురైన పంట భూములు

పచ్చని బంగారు పంటలు పండే లంక భూములు కృష్ణానది వరదలకు కోతకు గురై రైతులకు గుండెఘోషను మిగుల్చుతున్నాయి. ఏటా సంభవించే వరదలకు 30 నుంచి 50 ఎకరాల భూములు కోతకు గురై నదిలో కలిసిపోయి ఇసుక మేటలుగా తయారవుతున్నాయి. ఒకపక్క పంట భూములు కోతకు గురవుతున్న బాధ ఉంటే మరోవైపు లంక గ్రామాలకు ప్రమాదం ముంచుకు వస్తోందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. - తోట్లవల్లూరు-ఆంధ్రజ్యోతి

తోట్లవల్లూరు మండలంలో 8 లంక గ్రామాలున్నాయి. ఐలూరు శివారు గ్రామాలైన కనిగిరిలంక, ములకలపల్లిలంక, దేవరపల్లి శివారు పొట్టిదిబ్బలంక, చాగంటిపాడు శివారు పిల్లివానిలంక, పాములలంక, దాని శివారు తుమ్మలపచ్చికలంక, వల్లూరుపాలెం శివారు కాళింగదిబ్బలంక, రొయ్యూరు శివారు తోడేళ్లదిబ్బ (రావిచెట్టులంక)లంక గ్రామాలు కృష్ణానది పాయల మధ్య ఉన్నాయి. ఈ ఎనిమిదిలంక గ్రామాల్లో 3,500 జనాభా నివసిస్తున్నారు. సుమారు 10 వేల ఎకరాల పంట భూములున్నాయి. కరకట్ట వెంబడి గ్రామాల రైతులకు అక్కడ పంట భూములున్నాయి. ఎంతో సారవంతమైన ఈ భూముల్లో పసుపు, కంద, అరటి, చెరకు, తమలపాకు, బొప్పాయి, తదితర వాణిజ్య పంటలు, కూరగాయ పంటలను రైతులు పండిస్తున్నారు. నదీపాయల మధ్య ఈ భూములుండటంతో కృష్ణానదికి వరద వచ్చినప్పుడల్లా పంటలు ముంపునకు గురై నష్టాన్ని కలిగిస్తాయి. అయినా ఎదుర్కొని మళ్లీ పంటలు పండించి ముందుకు సాగుతున్నారు. కానీ వరద ఉధృతికి ఏకంగా పంట భూములు కోతకు గురికావటం కలవర పరుస్తోంది. ఏటా వచ్చే వరదలకు పంట భూములు విరిగిపోయి నదిలో కలుస్తూ ఇసుక మేటలు వేస్తున్నాయని రైతులు వాపోతున్నారు. గతేడాది సెప్టెంబరులో సంభవించిన అతిపెద్ద వరదకు పంట భూములు విపరీతంగా కోతకు గురయ్యాయని కనిగిరిలంక, ములకలపల్లిలంక రైతులు చెప్పారు. ఇదిలాగే కొనసాగుతూ ఉంటే భవిష్యత్తులో జనాలు నివసిస్తున్న లంక గ్రామాలకు సైతం ముప్పు వాటిల్లే ప్రమాదం ఉంది. అలాగే తోడేళ్లదిబ్బలంక వద్ద పెద్ద ఏటిపాయ వైపు, దేవరపల్లి వద్ద కరకట్ట వైపున పంట భూములు కోతకు గురయ్యాయి. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ సైతం నదిలోకి వచ్చేసిందంటే తీవ్రత ఎంత అధికంగా ఉందో తెలుస్తుంది. ఈ భూముల కోతపై ఐలూరు సర్పంచ్ పీరాటి సూజాత మండల పరిషత్ సమావేశంలో అధికారుల దృష్టికి తీసుకు వచ్చారు. కనిగిరిలంక, ములకలపల్లిలంక గ్రామాల రైతుల పంట భూములు విపరీతంగా కోతకు గురవుతున్నాయని, నివారించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఇది సాధ్యం కాదని అధికారులు తేల్చారు. సముద్ర తీరప్రాంత రక్షణకు అనువుగా ఉండే మడ అడవుల్లాంటి మొక్కలు నది అంచు వెంట నాటితే భూమి కోత తీవ్రతను కొంతైనా తగ్గించే అవకాశం ఉండవచ్చని ప్రజలు సూచిస్తున్నారు.

ఒకేచోట 30 ఎకరాల భూముల కోత
కడియాల సత్యప్రసాద్, రైతు, ఐలూరు



గతేడాది సెప్టెంబరులో వచ్చిన కృష్ణానది వరదలకు ఒకేచోట పలువురు రైతులకు చెందిన 30 ఎకరాల పంట భూములు కోతకు గురై నదిలో కలిసిపోయాయి. అందులో తనకు చెందిన పంట భూములున్నాయి. భూములు కోతకు గురయ్యాయని బాధ పడటం మినహా ఏమీ చేయలేని పరిస్థితి. దీన్ని ప్రభుత్వం కూడా నివారించే అవకాశం లేదు. మళ్లీ ఎప్పుడైనా మట్టిమేటలు ఏర్పడితే సాగు చేసుకోవటం తప్ప మరో మార్గం లేదనిపిస్తోంది.

లంక గ్రామాలకు ముప్పు
బూరగడ్డ వీరబాబు, రైతు, కనిగిరిలంక



కనిగిరిలంక, ములకలపల్లిలంక గ్రామాల్లోని పంట భూములు ఎక్కువగా కోతకు గురవుతున్నాయి. కృష్ణానది వరద నేరుగా వచ్చి పంట భూములను తాకుతుండటంతో కోత ఏర్పడుతోంది. ఇలా భూములు కోతకు గురవుతూ ఉంటే భవిష్యత్తులో లంక గ్రామాలకు పెనుముప్పు వాటిల్లే ప్రమాదం ఉంది. కోత నివారణకు అధికారులు తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

- ఏటా వరదలకు భూములను కోల్పోతున్న లంక రైతులు
- కనిగిరిలంక, ములకలపల్లి లంకల్లో తీవ్రంగా నష్టం
- మట్టి కొట్టుకుపోయి ఏర్పడుతున్న ఇసుక మేటలు
- పంట భూములే కాదు గ్రామాలకూ పొంచిన ప్రమాదం

రాజధానిలో ప్రభుత్వ భవనాలకు శుద్ధ జలం

● రూ. 7 కోట్లతో ఫిల్టర్ హౌస్ నిర్మాణం ● రాజధానిలో ప్రభుత్వ భవన సముదాయాలకు నీరు పంపిణీ ● 24/7 తాగునీటి సరఫరాకి బృహత్ ప్రణాళిక

తుళ్లూరు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిలో శాశ్వత ప్రాతిపదికన నిర్మించనున్న ప్రభుత్వ భవన సముదాయాలకు (గవర్నమెంటు కాంప్లెక్స్ ఐదు టవర్లు, హైకోర్టు, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, ఐఏఎస్, ఐపీఎస్, క్లాస్ 2,4 ఉద్యోగస్థుల గృహాలు, హెచ్‌వోడీ భవనాలు, సీఆర్డీఏ జోనల్ కార్యాలయం) పరిశుద్ధమైన తాగునీరు అందించడానికి సీఆర్డీఏ బృహత్ ప్రణాళికను సిద్ధం చేసింది. ఇందుకోసం రూ. 7 కోట్లతో రాయపూడి కృష్ణానది ఒడ్డున ఫి ల్టర్, పంపింగ్ హౌస్‌ల నిర్మించారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలోనే దీనికి సంబంధించిన పనులు ప్రారంభమయ్యాయి. ప్రస్తుతం కూట మి ప్రభుత్వం రాజధాని నిర్మాణాన్ని శరవేగం గా పూర్తి చేయాలన్న పట్టుదలతో ఉంది. సీఎం చంద్రబాబు రాజధాని నిర్మాణ పనులపై ప్రత్యే క దృష్టి సారించారు. వీటిలో భాగంగానే రాజధాని భవన సముదాయాలకు శుద్ధమైన తాగునీటి సరఫరా నిమిత్తం పైపు లైను ఏర్పాటు పనులను ప్రారంభించింది. రాయపూడి నుంచి శాఖమూరు రెవెన్యూ పరిధిలోని ఉద్యోగస్తుల ఇళ్ల వరకు పది కోట్ల వ్యయంతో 13 కిలో మీటర్ల మేర పైపులైన్ ఏర్పాటు చేయనున్నారు. రాజధానిలో ప్రభుత్వ భవన సముదాయాలు ఎప్పుడు పూర్తయితే అప్పుడు 365 రోజులు, 24 గంటలు తాగునీటిని సరఫరా చేయడానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు.




రాజధాని అమరావతిలో ప్రభుత్వ భవనాలకు శుద్ధమైన తాగునీటిని అందించేందుకు నిర్మించిన ఫిల్టర్ హౌస్, కృష్ణానది ఒడ్డున ఏర్పాటు చేసిన ఫిల్టర్ బెడ్, హైకోర్టు వద్ద పైపులైన్‌కు ఏర్పాటు చేసిన ట్యాప్


సినీ హీరో, హిందూపురం శాసనసభ్యుడు, పద్మభూషణ్ బాలకృష్ణకు అభినందనలు తెలియజేస్తున్న కళాసంస్థల ప్రతినిధులు

హీరో బాలకృష్ణకు కళాసంస్థల అభినందనలు

విజయవాడ కల్చరల్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): సుప్రసిద్ధ సినీ హీరో నందమూరి బాలకృష్ణకు కేంద్ర ప్రభుత్వం పద్మభూషణ్ ప్రకటించిన సందర్భంగా కళాసంస్థలు హర్షం వ్యక్తం చేస్తూ హీరో బాలకృష్ణకు అభినందనలు తెలియజేశాయి. గురువారం కౌతా పూర్ణానందం సత్రంలోని కళా సంస్థల కార్యాలయంలో నిర్వహించిన అభినందన సభలో తెలుగు కళావాహిని అధ్యక్షుడు చింతకాయల చిట్టిబాబు, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సాంస్కృతిక సామాజిక సేవా సంస్థ ప్రతినిధి కె.డేవిడ్‌రాజు, సువర్ణమణి రిథమ్స్ అధ్యక్షులు మారేపల్లి జోషి, ప్రిన్స్ మెలోడీస్ అధ్యక్షులు ప్రిన్స్, జేపీ అండ్ రాజ్ స్వరాంజలి అధ్యక్షులు ఆదిరాల జయప్రభు, సయ్యద్ యాకూబ్, గాయకులు డి.చంద్రశేఖర్, మధుసూదనరావు తదితరులు అభినందనలు తెలిపారు. తండ్రి నందమూరి తారకరామారావు నుంచి నటనలో, ప్రజల సేవ చేసే గుణంలో రాజకీయ ప్రతినిధిగా వచ్చిన వారసత్వాలను పుణికిపుచ్చుకొన్న ఆయన మరింత కీర్తి శిఖరాలనధిరోహించాలన్నారు.

ముగిసిన ఎన్టీఆర్ జిల్లాస్థాయి క్రీడాపోటీలు

వన్‌టౌన్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ జిల్లా నెహ్రూ యువ కేంద్రం బుధ, గురువారాల్లో నిర్వహించిన జిల్లాస్థాయి క్రీడా పోటీలు ముగిశాయి. కేబీఎన్ కళాశాల, ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ కళాశాలలో పోటీలను నిర్వహించారు. బ్లాక్‌లెవల్, మండలస్థాయి క్రీడాకారులు కూడా ప్రాతినిధ్యం వహించారు. విజేతలకు ఎన్టీఆర్ జిల్లా ఆర్డీవో వెంకటేశ్వరరావు, నెహ్రూ యువ కేంద్రం జిల్లా యూత్ ఆఫీసర్ సుంకర రాము, ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ కళాశాల ప్రిన్సిపాల్ భాగ్యలక్ష్మి, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ కొల్లేటి రమేష్, ఫిజికల్ డైరెక్టర్ యుగంధర్ బహుమతి ప్రదానం చేశారు. వాలీబాల్‌లో తిరువూరు వాహిని కళాశాల యూత్ క్లబ్ క్రీడాకారులు మొదటి బహుమతి పొందారు. కబడ్డీ మహిళల విభాగంలో లక్కిరెడ్డి బాలిరెడ్డి ఇంజనీరింగ్ కాలేజీ యూత్ క్లబ్ విద్యార్థినులు, బాడ్మింటన్‌లో పురుషులు, మహిళల విభాగంలో తిరువూరు వాహినీ కాలేజీ విద్యార్థులు, పరుగుపందెం మహిళల విభాగంలో వాహినీ కాలేజీ విద్యార్థిని, పురుషుల విభాగంలో ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ కాలేజీ విద్యార్థి బహుమతులు గెలుచుకున్నారు.

ఆర్టీసీ ఎండీగా ద్వారకా తిరుమలరావును కొనసాగించడంపై ఈయూ హర్షం

బస్‌స్టేషన్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ప్రజా రవాణా సంస్థ (ఆర్టీసీ) ఎండీగా ద్వారకాతిరుమల రావును కొనసాగించడంపై ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ (ఈయూ) గురువారం ఒక ప్రకటనలో హర్షం వెలిబుచ్చారు. ఈనెల 31న పదవీ విరమణ చేస్తున్నప్పటికీ మరో ఏడాది పాటు ఇదే హోదాలో కొనసాగిస్తూ ఆదేశాలు జారీ చేసినందుకు సీఎం చంద్రబాబుకు ఈయూ రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదరరావు, ప్రధాన కార్యదర్శి జీవీ నర్సయ్య ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

విద్యాప్రమాణాలు మెరుగుపర్చాలి

కృష్ణాజిల్లా కలెక్టర్ డీకే బాలాజీ

బంటుమిల్లి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): కార్పొరేట్ స్కూళ్ల స్థాయిలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల విద్యా ప్రమాణాలు మెరుగు పరచడమే లక్ష్యమని కలెక్టర్ డీకే బాలాజీ అన్నారు. గురువారం బంటుమిల్లి మండలంలో కలెక్టర్ సుడిగాలి పర్యటన చేశారు. ఇందులో భాగంగా బంటుమిల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించిన అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేసి నాణ్యత ప్రమాణాలు పరిశీలించారు. మెనూ ప్రకారం విద్యార్థులకు ప్రతి రోజూ భోజనం అందించాలని సూచించారు. ప్రతి విద్యార్థికి వైద్య పరీక్షలు తప్పనిసరిగా నిర్వహించి వాటి వివరాలను రికార్డుల్లో నమోదు చేయాలన్నారు. ప్రాథమిక విద్యతోనే విద్యార్థి భవిష్యత్తు ఆధారపడి ఉంటుందని వారికి ఆసక్తి కలిగేలా బోధన ఉండాలన్నారు. బంటుమిల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి రోజువారీగా ఎంతమంది వైద్య సేవలు పొందుతున్నారో అడిగి తెలుసుకున్నారు. గడువు తీరిన మందులు లేకుండా జాగ్రత్త వహించాలని, అత్యవసర మందులను అందుబాటులో ఉంచుకోవాలని కలెక్టర్ సూచించారు. మల్లేశ్వరం గ్రామంలో రెవెన్యూ, సర్వే అధికారులు నిర్వహిస్తున్న క్షేత్రస్థాయి రీసర్వే పనులు పరిశీలించారు. రెవెన్యూ సమస్యలు లేని గ్రామాలుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. భూ రీ సర్వే వల్ల భవిష్యత్తులో భూ వివాదాలకు తావుండదన్నారు. మల్లేశ్వరం రక్షిత మంచినీటి పథకం చెరువులను పరిశీలించారు. జిల్లా సర్వే అధికారి జోషి, ఇన్‌చార్జ్ తహసీల్దార్ పూర్ణచంద్రరావు, ఇన్‌చార్జ్ ఎంపీడీవో శైలజ కుమారి. మండల విద్యాశాఖాధికారులు బాల త్రిపుర సుందరి, వెంకటేశ్వరరావు, వైద్యాధికారులు డాక్టర్ పవన్, సౌందర్య, సర్వేయర్ దాస్, హైస్కూల్ హెచ్‌ఎం జీవీ వెంకట్రావు, వివిధ శాఖాధికారులు పాల్గొన్నారు.


బంటుమిల్లి హైస్కూల్లో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న కలెక్టర్ బాలాజీ


ప్రైవేటు ఇసుక క్వారీకి హద్దులు నిర్ణయించి సర్వే రాయి పాతిన అధికారులు

భారీగా ఇసుక సంపద

● ఎన్నో వివాదాలను దాటుకుని అధికారుల సర్వే
● ఐలూరు ఇసుక క్వారీకి హద్దులు

తోట్లవల్లూరు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఐలూరులో అనంతమైన ఇసుక సంపద అందుబాటులోకి రానుంది. రెండు జిల్లాలకు ఐదేళ్లపాటు అందించేంత నాణ్యమైన గండ్ర ఇసుక సంపద ఇక్కడుంది. 5 మీటర్ల లోతైన ఇసుక ఏర్పడి ఉంది. ఇక్కడ క్వారీ ఏర్పాటు చేయటం ఇదే తొలిసారి. దీంతో నాణ్యమైన గండ్ర ఇసుక నిల్వలు ఇక్కడ పేరుకుపోయి ఉన్నాయి. 80 ఎకరాల్లో సుమారు 25 లక్షల క్యూబిక్ మీటర్ల ఇసుక ఉన్నట్టు అంచనా. ఇంత ఇసుక ఎక్కడా లేదంటున్నారు. ఈ భూములపై 12ఏళ్ల పోరాటం చేసి కోర్టులో విజయం సాధించామని రైతు కడియాల సత్యప్రసాద్ తెలిపారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉండగా నాటి ఎమ్మెల్యే డీవై దాస్ కొందరు సర్వే అధికారులను తీసుకువచ్చి ప్రభుత్వ భూములుగా చెప్పి 20 రోజుల పాటు సర్వేచేయగా తాము కోర్టులో పోరాటం చేసి విజయం సాధించామన్నారు. దీంతో ఇటీవల అధికారుల బృందం అనేక సార్లు సర్వేచేసి పట్టాభూములుగా గుర్తించి హద్దులు వేశారని, అందులో 30 ఎకరాల్లో ఇసుక తవ్వకాలకు అనుమతులు లభించాయన్నారు. త్వరలో ఇసుక తవ్వకాలను ప్రారంభించనున్నామన్నారు.

పాడిరైతులకు అండగా ఉంటాం

● కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని

గుడ్లవల్లేరు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): కృష్ణా మిల్క్ యూనియన్ పాల ఉత్పత్తి దారులకు అండగా ఉంటుందని కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు అన్నారు. గురువారం యూనియన్ వజ్రోత్సవాల్లో భాగంగా కౌతవరం పాలుత్పత్తిదారుల సంఘంలో 60ఏళ్లుగా యూనియన్‌తో మమేకమై పాలు పోస్తున్న పాడిరైతులను సన్మానించారు. కౌతవరం పాలుత్పత్తిదారుల సంఘానికి కూడా 60ఏళ్ల ఘన చరిత్ర ఉందన్నారు. సంఘం ఏర్పడినప్పటి నుంచి వీబీకేబీ సుబ్బారావు (బాబూరావు) అధ్యక్షుడిగా ఉంటూ సంఘాన్ని, పాడి రైతును లాభాల బాటలో ఉంచారని ఆంజనేయులు కొనియాడారు. రూ.40 పైసలతో మొదలైన పాల ధర ప్రస్తుతం గేద పాలకు రూ.62, ఆవు పాలకు రూ.41 ఇస్తున్నామన్నారు. 1965లో 15మంది పాల ఉత్పత్తిదారులతో సంఘం స్థాపించబడి నేటికి 236 మంది రైతులు ఉత్పత్తిదారులుగా ఉండటం ముదావహమన్నారు. కృష్ణామిల్క్ యూనియన్ జిల్లా డైరెక్టరుగా కూడా బాబూరావు ఘనమైన సేవలందిస్తున్నారన్నారు. సంఘ అధ్యక్షుడు వల్లభనేని భాస్కర కుటుంబ వెంకట సుబ్బారావు, డైరెక్టర్ అర్జా వెంకట నగేష్, కాగిత జయరాం,ఫీడ్ కమిటీ సభ్యులు మోతుకూరి వెంకటేశ్వరరావు, గుడ్లవల్లేరు పాలశీతల కేంద్రం మేనేజరు తోట సత్యనారాయణ, సూపర్వైజరు పెయ్యేటి బసవ రాజ్‌కుమార్ పాల్గొన్నారు.


కౌతవరం పాలకేంద్రంలో మాట్లాడుతున్న ఆంజనేయులు

డంపింగ్ యార్డులేని రాష్ట్రంగా ఏపీ

● స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభి

గుణదల, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): డంపింగ్ యార్డ్ లేని రాష్ట్రంగా ఏపీని తయారు చేస్తామని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభి అన్నారు. బ్యూరో ఆఫ్ ఇండియా స్టాండర్డ్స్ ఆధ్వర్యంలో సెగ్రిగేషన్ ఆఫ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ గుణదల్లోని హయత్ హోటల్లో గురువారం నిర్వహించారు. పట్టాభి ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడుతూ డంపింగ్ యార్డ్ అనేది రాష్ట్రంలో ఉండకూడదనేది కూటమి లక్ష్యంగా పెట్టుకుని పనిచేస్తున్నట్టు తెలిపారు. వేస్ట్ ప్రాసెసింగ్ యూనిట్స్ మాత్రమే రాష్ట్రంలో ఉండాలన్నారు. డోర్ టూ డోర్ వేస్ట్ కలెక్షన్ చేయడానికి ఆదేశాలిస్తున్నామన్నారు. వేస్ట్‌ని తడి పొడి చెత్తగా వేర్వేరుగా సేకరించబోతున్నామన్నారు. వాటిని రీసైకిల్ చేసి ఎరువుగా ఉపయోగించబోతున్నామన్నారు. రెవెన్యూ ఫర్ వేస్ట్ అనే కాలమ్‌ను రాష్ట్ర బడ్జెట్‌లో ప్రజలు త్వరలో చూడబోతున్నారన్నారు. అన్ని శాఖల నుంచి ప్రభుత్వానికి ఎలా ఆదాయం వస్తుందో అలాగే చెత్త నుంచి కూడా ప్రభుత్వానికి ఆదాయం రాబోతుందన్నారు. త్వరలో ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్‌ను స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్‌లో ఏర్పాటు చేయబోతున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న స్వచ్ఛాంధ్ర కార్యక్రమానికి బ్యూరో ఆఫ్ ఇండియా స్టాండర్డ్స్ మద్దతు తెలపడం శుభపరిణామన్నారు.

టీడీపీ కార్యాలయంపై దాడి ఘటనలో తోట వెంకయ్య అరెస్టు

గన్నవరం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): గన్నవరం టీడీపీ కార్యాలయంపై దాడి ఘటనలో ఒకరిని పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసులో మొత్తం 93 మంది ఉన్నారు. కొంతమందికి యాంటిసిపేటరీ బెయిల్‌ను గత నెల 20న హైకోర్టు రద్దు చేసింది. దీంతో నిందితులు పరారయ్యారు. పోలీసులు ప్రత్యేక దర్యాప్తు చేపట్టగా 47 మంది అరెస్టు కావాల్సి ఉండగా ఇటీవల ఆరుగురిని, బుధవారం ఒకరు, తాజాగా గురువారం ఏ-46 అయిన తోట వెంకయ్యను ముసునూరు మండలం చెక్కపల్లి వద్ద మధ్యాహ్నం 2 గంటలకు అరెస్టు చేసినట్టు సీఐ బీవీ శివప్రసాద్ తెలిపారు. అదుపులోకి తీసుకున్న తోట వెంకయ్యను సీఐడీ అధికారులకు అప్పగించినట్టు చెప్పారు. ఇదిలా ఉండగా పి.హేమంత్-ఏ6, మద్దాల నవీన్ ఏ-13 సీఐడీ కార్యాలయంలో లొంగిపోయినట్టు తెలిపారు. పరారీలోఉన్న కైలే శివకుమార్, వేల్పూరి బసవరావు కొడుకులను సీఐడీ అధికారులు తీసుకువెళ్లి విచారించి పంపేశారు.


ఆంధ్రప్రదేశ్ ఫొటో జర్నలిస్ట్స్ అసోసియేషన్ 2025 కేలెండర్‌ను రాష్ట్ర సచివాలయంలో ఆవిష్కరిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, చిత్రంలో అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు గోరంట్ల నారాయణ, అధ్యక్షుడు విజయభాస్కర్, కోశాధికారి మహేశ్, ప్రశాంత్

మన అమరావతి చాలా బాగుంది

● ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు
● ఏపీ ఫొటో జర్నలిస్ట్ సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

అమరావతి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): 'మన అమరావతి.. చాలా బాగుంది' అంటూ లైట్ల వెలుగుల్లో వెలిగిపోతున్న రాజధాని ప్రాంత ఫొటోను చూసి ముఖ్యమంత్రి చంద్రబాబు సంతోషం వ్యక్తం చేశారు. ఏపీ ఫొటో జర్నలిస్ట్ అసోసియేషన్ 2025 క్యాలెండర్‌ను వెలగపూడి సచివాలయంలో గురువారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా క్యాలెండర్లోని ఫొటోలు చూసిన ఆయన 2018లో లైట్ల వెలుగులో ఉన్న రాజధాని ప్రాంత ఫొటో చూసి చిరునవ్వు చిందించారు. ప్రజా సమస్యల్ని కెమెరా నేత్రంతో ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చి పరిష్కారానికి కృషి చేస్తోన్న ఫొటో జర్నలిస్టుల్ని సీఎం అభినందించారు. ఈకార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు విజయ భాస్కర్, నారాయణ, మహేశ్, ప్రశాంత్, సతీష్ పాల్గొన్నారు.

బొడ్డుబొమ్మ సెంటర్ పార్కింగ్‌లో

నిరాటంకంగా వసూళ్ల దందా

● పట్టించుకోని అధికారులు

వన్‌టౌన్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): వన్‌టౌన్ రథం సెంటర్, బొడ్డుబొమ్మ వద్ద కార్పొరేషన్ ఆధ్వర్యంలోని పార్కింగ్‌లో అనధికారికంగా వసూలు దందా నిరాటంకంగా కొనసాగుతోంది. వాహనదారులు, భక్తులు ప్రభుత్వాధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ పట్టించుకోవటం లేదని ఆరోపణలు వస్తున్నాయి. బొడ్డుబొమ్మ సెంటర్ పార్కింగ్ వద్ద దుర్గగుడికి వచ్చిన భక్తులు తమ వాహనాలను పార్కింగ్ చేయగా, పక్కనే ఉన్న మరో పార్కింగ్ సిబ్బంది ఇక్కడ పార్కింగ్ చేసిన వాహనదారుల వద్దకు వెళ్లి ఒక్కో వాహనం నుంచి రూ.100, 200 వరకు అనధికారికంగా వసూలు చేస్తున్నారు. అక్రమ రుసుము వసూలుపై ప్రశ్నించిన వాహనదారులపై దౌర్జన్యంగా వ్యవహరిస్తూ, అసభ్యకరంగా దూషిస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఈ దందా గురించి అధికారులకు తెలిసినా పట్టించుకోకపోవటంపై విమర్శలు వినిపిస్తున్నాయి.

క్యూలో నిలబడకుండానే టికెట్ల జారీ

రైల్వేస్టేషన్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): రైల్వే ప్రయాణికులు రైల్వేస్టేషన్లలో టికెట్ల కౌంటర్ల ముందర క్యూలైన్లలో వేచి ఉండనవసరం లేకుండా సులభంగా టికెట్లు పొందేందుకు రైల్వే శాఖ యూనివర్శిడ్ టిక్కెట్ సిస్టమ్ (యూటీఎస్)ను అందుబాటులోకి తెచ్చింది. సమయాన్ని వృథా కాకుండా వెంటనే టిక్కెట్ పొందేందుకు ఈ యాప్ సహకరిస్తుంది. దక్షిణ మధ్య రైల్వే విజయవాడ జోన్ అంతటా డిజిటల్ చెల్లింపులను ప్రోత్సహించేదుకు డివిజన్‌లో 90 యూటీఎస్ కౌంటర్లు ఏర్పాటు చేశారు. దీనికి అనుబంధంగా 172 క్యూఆర్ కోడ్‌లను కూడా అమర్చారు. మొత్తంగా సౌత్ సెంట్రల్ రైల్వేలో 897 క్యూఆర్ పరికరాలున్నాయి. కౌంటర్ల వద్ద చిల్లర సమస్యను ఇలా పరిష్కరించినట్లయింది. మొబైల్‌లో క్యూఆర్ కోడ్ ప్రదర్శితమైన వెంటనే యూపీఐ ఆధారిత చెల్లింపులను వినియోగించి, కోడ్‌ను స్కాన్ చేసి చెల్లింపు చేశాకే టికెట్ వస్తుంది. ఈ సందర్భంగా గురువారం విజయవాడ డివిజన్ డీఆర్‌ఎం నరేంద్ర ఏ పాటిల్ మాట్లాడుతూ యూటీఎస్, పీఆర్ఎస్ కౌంటర్లలో క్యూఆర్ కోడ్ ఆధారిత చెల్లింపుల విధానాన్ని ప్రయాణికులు వినియోగించుకోవాలన్నారు.


రైల్వేస్టేషన్‌లో టికెట్ కౌంటర్ల వద్ద అమర్చిన క్యూ ఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తున్న ప్రయాణికుడు

దుర్గగుడిలో అనధికార ఉద్యోగి హల్‌చల్

● భక్తుల పట్ల దురుసుగా ప్రవర్తిస్తున్నవైనం

వన్‌టౌన్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): దుర్గగుడిలోని అన్నదాన విభాగంలో కమిషనర్ అనుమతి లేకుండా విధులు నిర్వహిస్తున్న మణికుమార్ అనే ఉద్యోగి భక్తులతో దురుసుగా ప్రవర్తిస్తున్నాడని, అన్నప్రసాదం స్వీకరించేటప్పుడు ఇబ్బందులు సృష్టిస్తున్నాడని భక్తులు ఆరోపిస్తున్నారు. దేవదాయ శాఖ కమిషనర్ అనుమతి లేకుండా 5 నెలల నుంచి మణికుమార్ మహామండపం రెండో అంతస్తులోని అన్నదాన విభాగంలో మైక్ ప్రచారం చేస్తున్నాడు. కొన్నిరోజుల నుంచి మైక్ ప్రచారం చేయకుండా అన్నప్రసాదం స్వీకరించే భక్తుల వద్దకు వెళ్లి త్వరత్వరగా భోజనం చేయాలంటూ తొందరపెడుతూ వారి మనోభావాలు దెబ్బతినేలా వ్యవహరిస్తున్నాడు. దీనిపై భక్తులు సమాచార కేంద్రంలో ఫిర్యాదు చేసినట్టు తెలిసింది. కమిషనర్ అనుమతి లేకుండా అతడిని ఎలా నియమించారని, జీతం ఎలా చెల్లిస్తున్నారని తోటి ఉద్యోగులు ప్రశ్నిస్తున్నారు. అన్నదాన విభాగంలో అంతా తానై ఉద్యోగులను కూడా బెదిరిస్తున్నాడని వారు ఆరోపిస్తున్నారు. ఈవో స్పందించి అతడిపై చర్యలు తీసుకోవాలని భక్తులు, ఉద్యోగులు కోరుతున్నారు.

స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ఒప్పుకోం

● సీపీఎం పట్టణ కార్యదర్శి ఆర్సీపీ రెడ్డి హెచ్చరిక

గుడివాడ, జనవరి 30(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేస్తామని, అమ్మేస్తామని, మూసేస్తామని ప్రచారం చేస్తోందని, వాటిని మానుకోవాలని, ప్లాంట్ ప్రైవేటీకరణను ఒప్పుకోబోమని సీపీఎం పట్టణ కార్యదర్శి ఆర్సీపీ రెడ్డి హెచ్చరించారు. గురువారం కామ్రేడ్ సుందరయ్య భవన్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేయొద్దని ప్లాంట్ ఉద్యోగులు 1,500 రోజులు నుంచి ఆందోళన చేస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వంపైన ఆధారపడిన కేంద్రం రూ.11,500 కోట్లు కేటాయించిందని, దీంతో కొన్ని రోజులు పరిశ్రమ నడుస్తోందని తెలిపారు.



నిరసన తెలుపుతున్న ఏరియా ఆస్పత్రి కాంట్రాక్టు సఫాయి కార్మికులు

తక్షణమే జీతాలు చెల్లించాలి

గుడివాడ, జనవరి 30(ఆంధ్రజ్యోతి): తమకు రెండు నెలలుగా జీతాలు చెల్లించకుండా కాంట్రాక్టర్ తాత్సారం చేస్తున్నారని ఏరియా ప్రభుత్వ ఆస్పత్రి ఏఐటీయూసీ అనుబంధ మెడికల్ కాంట్రాక్టు ఎంప్లాయీస్ యూనియన్ శానిటేషన్ సఫాయి మహిళా కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం అన్నే నరసింహరావు ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి వద్ద సఫాయి మహిళ కార్మికులు సమ్మెను చేపట్టారు. రెండు నెలలుగా తమకు జీతాలు చెల్లించాలని, మూడేళ్లుగా పీఎఫ్‌లు కడుతున్నట్టు కాంట్రాక్టర్ మోసం చేస్తున్నాడని, వెంటనే జమచేయాలని వారు డిమాండ్ చేశారు. 'కాంట్రాక్టర్ రెండు నెలలు నుంచి జీతాలు చెల్లించడం లేదు. రూ.10వేలు జీతం ఇస్తామని చెప్పి, పీఎఫ్‌లు కడుతున్నామని మోసం చేసి రూ.8వేలే చెల్లిస్తున్నాడు. తక్షణమే బకాయి ఉన్న రెండు నెలల జీతం ఇవ్వాలి. పీఎఫ్‌లను కట్టించి, రూ.18వేలు జీతం చెల్లించాలి. లేకుంటే సమ్మెను ఉధృతం చేస్తాం.' అని ఏఐటీయూసీ గౌరవాధ్యక్షుడు గూడపాటి ప్రకాష్‌బాబు, మెడికల్ కాంట్రాక్టు వర్కర్స్ జిల్లా అధ్యక్షుడు లక్ష్మణరావు, కార్యదర్శి చింతలూరి సత్యనారాయణ డిమాండ్ చేశారు. వద్దాది రమణమ్మ, కనుమూరి విజయలక్ష్మి, వేల్పుల ధనలక్ష్మి, మాతంగి మేరిమ్మ, దొండపాటి పద్మావతి పాల్గొన్నారు.

తాగునీటి చెరువులు పూర్తిగా నింపండి

గుడివాడ రూరల్, జనవరి 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని గ్రామాలకు తాగునీరు అందేలా చూడాలని, పంచాయతీ, తాగునీటి చెరువులను పూర్తిగా నింపాలని పంచాయతీ అధికారులను ఎంపీడీవో డీవై విష్ణుప్రసాద్ ఆదేశించారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అట్లూరి వెంకటేశ్వరరావు, ఈవోపీఆర్డీ శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శులు, అగ్రికల్చరల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.



అధికారులకు సూచనలిస్తున్న ఎంపీడీవో డీవై విష్ణుప్రసాద్

రోడ్ల పక్కన చెత్తకుప్పలు

వెదజల్లుతున్న దుర్గంధం ● ఇబ్బంది పడుతున్న లింగవరం గ్రామస్థులు



లింగవరం రైతు సేవాకేంద్రం సమీపాన ప్రధాన రహదారి పక్కన చెత్తకుప్ప

(ఆంధ్రజ్యోతి-గుడివాడ రూరల్): మండలంలోని లింగవరం గ్రామంలోని రహదారుల పక్కన, ప్రధాన రహదారి పక్కన చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయి. గ్రామస్థులు, నాగవరప్పాడుకు చెందిన కొందరు, ప్రైవేట్ హాస్పిటల్స్ సిబ్బంది చెత్త తెచ్చి ఎక్కడపడితే రోడ్ల పక్కన పడేస్తున్నారు. దీంతో సమీపంలో నివసించే ప్రజలు, రోడ్ల వెంట ప్రయాణించే వారు దుర్గంధంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి రహదారి వెంట చెత్త వేయకుండా చూడాలని గ్రామస్థులు కోరుతున్నారు.



గ్రామంలో రహదారి పక్కన..

చెత్త వేస్తే చర్యలు

స్థలాభావం వల్ల రెండు రోజులకోసారి చెత్తను తీసి, ఒక చోటకు చేరుస్తున్నాం. రెండు, మూడు రోజులకొకసారి దగ్ధం చేస్తున్నాం. రోడ్ల వెంబడి చెత్త వేయొద్దని చెబుతున్నాం. కొంతమంది పట్టణ ప్రజలు చెత్తను తెచ్చి లింగవరం రోడ్ల పక్కన వేస్తున్నారు. రోడ్ల వెంట చెత్త వేయకుండా చర్యలు తీసుకుంటాం. **-కె.అనూల, పంచాయతీ కార్యదర్శి**



గుడివాడ ఎస్పీఎస్ పాఠశాల, మొవ్వ హైస్కూల్‌లో పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న అధికారులు

బ్యానర్ల తొలగింపు

పామర్రు: ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ నియామవళి అమల్లోకి రావడంతో పామర్రులో వివిధ రాజకీయపార్టీలు ఏర్పాటు చేసిన బ్యానర్లు, కటౌట్లు, జెండాలను గురువారం సిబ్బందితో పంచాయతీ కార్యదర్శి అబ్దుల్ సలీం తొలగించారు. రాజకీయ పార్టీల నేతల విగ్రహాలకు ముసుగులు తొడిగారు. ఎన్నికల నిబంధనలు అనుసరించి రాజకీయ పార్టీల నేతలు బ్యానర్లు ఏర్పాటు చేయకుండా పంచాయతీకి సహకరించాలని సలీం కోరారు. శానిటరీ అధికారి సుధాకర్, కాంట్రాక్టు కార్మికుల మేస్త్రి శివనాగు పాల్గొన్నారు.



పామర్రు నాలుగురోడ్ల కూడలిలో రాజకీయ పార్టీల బ్యానర్లు తొలగిస్తున్న పంచాయతీ సిబ్బంది

కోడ్ అతిక్రమిస్తే చర్యలు

గుడివాడ రూరల్, జనవరి 30(ఆంధ్రజ్యోతి): గుడివాడ నియోజకవర్గంలో ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిందని, ఎవరైనా అతిక్రమిస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ రామకోటేశ్వరరావు హెచ్చరించారు. గురువారం కోడ్ అమల్లోకి రావడంతో ఎస్పీఎస్ పాఠశాలలోని ఏడు పోలింగ్ కేంద్రాలను, ఏజేకేలోని మూడు పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ పరిశీలించారు. ఎన్నికల కోడ్ పకడ్బందీగా అమలయ్యేలా అధికారులు చూడాలన్నారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు. మండలంలో నిబంధనలు పక్కాగా అమలయ్యేలా అధికారులు చూడాలని, రాజకీయ ఒత్తిళ్లకు లొంగొద్దని సూచించారు. మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు, ఎంపీడీవో విష్ణుప్రసాద్, పోలీసు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

కూచిపూడి: ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణ కోసం మొవ్వ జడ్పీ పాఠశాలలో పోలింగ్ కేంద్రాన్ని అధికారులు గురువారం పరిశీలించారు. పోలింగ్ కేంద్రంలో విద్యుత్, మంచినీటి సౌకర్యం, భవన స్థితిగతులను పరిశీలించారు. ఎంపీడీవో జె.విమాదేవి, తహసీల్దార్ మస్తాన్, ఎస్సై సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

ఎస్ఈఆర్ఎం హైస్కూల్‌లో..

గుడ్లవల్లేరు: ఎస్ఈఆర్ఎం హైస్కూల్, జూనియర్ కళాశాలలోని పోలింగ్ కేంద్రాలను అధికారుల బృందం పరిశీలించింది. బూత్‌లలో గదులు పోలింగ్‌కు అనుకూలంగా ఉన్నాయా..లేదా అని అధికారులు పరిశీలించారు. చేయాల్సిన ఏర్పాట్లపై ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపనున్నారు. ఎంపీవో టి.విజయసారధి, తహసీల్దారు లోకరాజు, గుడ్లవల్లేరు ఎస్సై ఎన్.వి.వి.సత్యనారాయణ, రెవెన్యూ కార్యాలయ అధికారి శివకుమార్ పాల్గొన్నారు.



గుడ్లవల్లేరులో..

త్వరలో నూతన పింఛన్లు, రేషన్‌కార్డులు

● ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా

పామర్రు, జనవరి 30(ఆంధ్రజ్యోతి): త్వరలోనే రాష్ట్ర ప్రభుత్వం నూతన పింఛన్లు, రేషన్‌కార్డులు, పేదలకు నివేశన స్థలాలు ఇస్తుందని ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా తెలిపారు. తన కార్యాలయంలో గురువారం గ్రీవెన్స్ డే కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. ప్రజలనుంచి వచ్చిన అర్జీలను స్వీకరించారు. ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని, కొత్త పింఛన్లు అందించాలని, డ్రెయినేజీలు, శ్మశానవాటికలు అభివృద్ధి చేయాలని కోరుతూ ప్రజలు అర్జీలను అందించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి తాడిశెట్టి నరేష్, తెలుగుయువత రాష్ట్ర కార్యదర్శి పానుగంటి సందీప్, కాటూరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

క్రీడాదుస్తుల బహూకరణ

పెదపారుపూడి, జనవరి 30(ఆంధ్రజ్యోతి): క్రీడలను ప్రోత్సహించడం కోసం వానపాముల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు రూ.10 వేలు విలువైన క్రీడా దుస్తులను మనోరమ అర్జునరావు, రావూరి పబ్లిక్ యుటిలిటీ ట్రస్ట్(మార్పు) సహకారంతో కుమారుడు సాదిక్, కుమార్ సూయజ్ బహూకరించారు. క్రీడల్లో మంచి ప్రతిభ కనబర్చి పాఠశాలకు మంచి పేరు తేవాలని వారు కోరారు. కావూరి చిన్న కోటేశ్వరరావు, ప్రధానోపాధ్యాయుడు రాఘవేంద్రరావు, వ్యాయామోపాధ్యాయుడు బూరగడ్డ అనిల్ పాల్గొన్నారు.



గుడివాడలో గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

పామర్రులో నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా

తోట్లవల్లూరులో నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు

స్ఫూర్తిప్రదాత గాంధీ

వర్ధంతి సందర్భంగా నివాళులర్పించిన ప్రజా ప్రతినిధులు, ఆర్యవైశ్య నాయకులు

పామర్రు, జనవరి 30(ఆంధ్రజ్యోతి): అహింసను మించిన ఆయుధంలేదని ప్రపంచానికి చాటిచెప్పిన మహనీయుడు మహాత్మ గాంధీ అని, ఆయన జీవిత చరిత్ర భవిష్యత్తు తరాలకు స్ఫూర్తిదాయకమని ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా అన్నారు. గాంధీ వర్ధంతి సందర్భంగా గురువారం టీడీపీ కార్యాలయంలో మహాత్ముడి చిత్రపటానికి ఎమ్మెల్యే నివాళులర్పించారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి తాడిశెట్టి నరేష్, కృష్ణా డెల్టా ప్రాజెక్టు వైస్ చైర్మన్ వల్లూరిపల్లి గణేష్, కుదరవల్లి ప్రవీణ్ చంద్ర, మంతెన రామాంజనేయులు పాల్గొన్నారు.

గుడివాడలో..

గుడివాడ: గాంధీ మండపంలోని మహాత్మ గాంధీ విగ్రహానికి ఎమ్మెల్యే వెనిగండ్ల రాము నివాళులర్పించారు. ఎన్టీఆర్ స్టేడియం కమిటీ ఉపాధ్యక్షుడు యలవర్తి శ్రీనివాసరావు, జనసేన ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్ పాల్గొన్నారు. మున్సిపల్ కార్యాలయంలోని గాంధీ విగ్రహానికి మున్సిపల్ కమిషనర్ బి.శ్రీనివాసరావు, అసిస్టెంట్ కమీషనర్ పి.శ్రీనివాసరావు నివాళులర్పించారు. తారకరామా వాకర్స్ క్లబ్ గుడివాడ అధ్యక్షుడు మెరుగుమాల బ్రహ్మయ్య ఆధ్వర్యంలో ఏలూరురోడ్డులోని గాంధీ విగ్రహానికినివాళ్లులర్పించారు. పట్టణ ఆర్యవైశ్య సంఘం ఉపాధ్యక్షుడు సాంబశివరావు అధ్యక్షతన కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో గాంధీ చిత్రపటానికి నేతలు నివాళులర్పించారు. రాజేంద్రనగర్‌లోని టౌన్ ఉన్నత పాఠశాలలో ఎన్టీఆర్ స్టేడియం వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచితంగా కళ్లజోళ్లను పంపిణీ చేశారు. గాంధీ చిత్రపటానికి నివాళులర్పించారు.

ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో..

తోట్లవల్లూరు: తోట్లవల్లూరులో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో మహాత్మ గాంధీ వర్ధంతిని నిర్వహించారు. వాసవీమాత ఆలయం వద్ద గాంధీ, పొట్టి శ్రీరాములు విగ్రహాలకు సంఘం నాయకులు తమ్మన ఉమా మహేశ్వరరావు, తాడికొండ సుధాకర్, కృష్ణ, బాలాజీ నివాళులర్పించారు.

గుడ్లవల్లేరులో..

గుడ్లవల్లేరు: మంచినీటి చెరువు గట్టున మహాత్మా గాంధీ విగ్రహం వద్ద ఆదేప్రాంతంలో ఉంటున్న సీనియర్ సిటిజన్ పెంటపాటి చిట్టిబాబు ఆధ్వర్యంలో వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథి లయన్స్ జిల్లా మాజీ గవర్నర్ వైసీపీ ప్రసాద్ నివాళులర్పించారు.



నివాళులర్పిస్తున్న వైసీపీ ప్రసాద్

పింఛన్ల తనిఖీ



మొవ్వలో లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పరిశీలిస్తున్న అధికారుల బృందం

కూచిపూడి, జనవరి 30(ఆంధ్రజ్యోతి): మంచానికే పరిమితమై ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పొందుతున్న లబ్ధిదారులను మూడు వైద్యబృందాలు గురువారం తనిఖీ చేశాయి. వైద్యాధికారులు డాక్టర్ మహిత, డాక్టర్ విజయ్‌కుమార్, డాక్టర్ సాయికిరణ్ సహకారంతో జిల్లా కేంద్రాల నుంచి తరలివచ్చిన వైద్యాధికారులు క్షుణ్ణంగా పరిశీలించారు. వీరికి సచివాలయాల కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు, ఏఎన్ఎంలు, ఆయాలు సహకరించారు. మొవ్వలో నిర్వహించిన తనిఖీ కార్యక్రమాన్ని ఎంపీడీవో జె.విమాదేవి పరిశీలించారు. పింఛన్‌దారుల నుంచి అధికారులు వేలిముద్రలు, ఐరిస్‌లు, సదరం సర్టిఫికెట్లు పరిశీలించారు.

వాగ్దానాలు విస్మరించిన కూటమి ప్రభుత్వం

● వైసీపీ అధికార ప్రతినిధి కైలే అనిల్‌కుమార్

పామర్రు, జనవరి 30(ఆంధ్రజ్యోతి): 'అధికారంలోకి వచ్చి ఏడు నెలలు పూర్తియినప్పటికీ, ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాలను కూటమి ప్రభుత్వం విస్మరించింది. అన్ని వర్గాల ప్రజలను వంచించింది.' అని వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ విమర్శించారు. వైసీపీ కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు రాష్ట్రాన్ని అప్పుల్లో ముంచుతుందని చంద్రబాబు గగ్గోలు పెట్టారని, గడిచిన ఏడునెలల్లోనే రూ.లక్ష ఇరవై వేల కోట్ల అప్పులు చేశారనని, ఆ డబ్బుతో రాష్ట్రానికి ఏంచేశారో వివరించాలని ఆయన డిమాండ్ చేశారు. వైసీపీ ప్రభుత్వ హయంలో అమలు చేసిన ఫీజు రీయింబర్స్‌మెంట్, అమ్మ ఒడి, రైతుభరోసా పథకాలు కూటమి ప్రభుత్వంలో అందక పేదలు అల్లాడుతున్నారన్నారు. పామర్రు నియోజకవర్గంలో ఇసుక, గ్రామాల్లో బెల్టుషాపుల ద్వారా దోపిడీలకు పాల్పడుతూ నెలకు రూ.30 లక్షల నుంచి రూ.40 లక్షల వరకు కూటమి నేతలు దోచుకోవడం వాస్తవం కాదా? అని ఆయన ప్రశ్నించారు. తోట్లవల్లూరులో ఇసుక కార్మికుల పొట్టకొడుతూ తమ కడుపులు నింపుకోవడం దారుణమన్నారు. తన హయాంలో విద్యుత్ సబ్‌స్టేషన్‌లో షిఫ్టు ఆపరేటర్ ఉద్యోగాలు ఉచితంగా ఇస్తే ప్రస్తుతం ఆ పోస్టులను ఒక్కొక్కటి ఆరు, ఏడు లక్షల రూపాయలకు అమ్ముకుంటున్నారని ఆరోపించారు. పేదల తరపున త్వరలో వైసీపీ పోరాటాలు చేస్తుందన్నారు.

నమ్మించి మోసం చేయడం చంద్రబాబుకు అలవాటే

● వైసీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మండలి హనుమంతరావు విమర్శ

గుడివాడ, జనవరి 30(ఆంధ్రజ్యోతి): నమ్మించి మోసం చేయడం సీఎం చంద్రబాబుకు అలవాటేనని, 2024 ఎన్నికల సమయంలో ఎలాగైన గెలవాలని సూపర్ సిక్స్ పథకాల పేరుతో హామీలను గుప్పించారని, అధికారంలోకి వచ్చాక వాటిని తుంగలో తొక్కారని వైసీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మండలి హనుమంతరావు విమర్శించారు. గురువారం భయ్యా వారివీధిలోని తన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చంద్రబాబు మోసపూరిత వాగ్దానాలకు బలికావద్దని ఎన్నికలకు ముందే జగన్మోహన్‌రెడ్డి వేడుకున్నారన్నారు. రాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకుపోయిందని, సూపర్‌సిక్స్ పథకాలు అమలు చేయలేమని ఇప్పుడు చంద్రబాబు మాట్లాడటం హాస్యాస్పదమన్నారు.

రైతుల ఖాతాల్లో రూ.1.17 కోట్లు జమ

పెదపారుపూడి, జనవరి 30(ఆంధ్రజ్యోతి): యలమర్రు రైతుసేవా కేంద్రం ద్వారా 614 మంది రైతులు ధాన్యం తోలారని పీఏసీఎస్ కార్యదర్శి గాయత్రి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. 36 గంటల్లో వారి ఖాతాల్లో రూ.1,17,11,536 జమ అయ్యాయని ఆమె పేర్కొన్నారు.

ముందుగానే గుర్తిస్తే కుష్ఠు నివారణ సాధ్యమే

తోట్లవల్లూరు, జనవరి 30(ఆంధ్రజ్యోతి): కుష్ఠువ్యాధిని ముందుగానే గుర్తించి చికిత్స తీసుకుంటే సులభంగా నివారించవచ్చని కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ జి.సోనిక తెలిపారు. దేవరపల్లిలో గురువారం కుష్ఠు నివారణ దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. కలెక్టర్ సందేశాన్ని చదివి ప్రతిజ్ఞ చేశారు. కుష్ఠు లక్షణాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తామని, ఫిబ్రవరి 13 వరకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని సోనిక తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మరీదు వెంకటేశ్వరరావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



దేవరపల్లిలో ప్రతిజ్ఞ చేస్తున్న వైద్య సిబ్బంది, సర్పంచ్ వెంకటేశ్వరరావు

స్టడీ మెటీరియల్ పంపిణీ

కూచిపూడి, జనవరి 30(ఆంధ్రజ్యోతి): స్టేట్ టీచర్స్ యూనియన్(ఎస్టీయూ) మొవ్వ మండల శాఖ ఆధ్వర్యంలో గురువారం 470 మంది పదో తరగతి విద్యార్థులకు యూనియన్ నేతలు స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. కూచిపూడి, కోసూరు, కాజ, మొవ్వ, పెదముత్తేవి, నిడుమోలు, పెడసనగల్లు, భట్లపెనుమర్రు జడ్పీ పాఠశాలల్లో మెటీరియల్ విద్యార్థులకు అందించారు. ఎస్టీయూ నేతలు మాధవరావు, ఎం.శ్రీనివాసరావు, సత్యప్రసాద్, గోపాలకృష్ణ, ఎం.వెంకట శ్రీనివాసులు, టి.శ్రీనివాసులు పాల్గొన్నారు.



కూచిపూడి హైస్కూల్‌లో స్టడీ మెటీరియల్ పంపిణీ చేస్తున్న ఎస్టీయూ నాయకులు

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	120, 129, 140
చికెన్ విత్ స్కిన్	230
చికెన్ స్కిన్‌లెస్	240

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ.480

పెడన కౌన్సిల్ సమావేశం వాయిదా

పెడన, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : పెడన మునిసిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం వాయిదా పడింది. గురువారం ఉదయం 11 గంటలకు 13 అంశాల అజెండాతో అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో అజెండాపై చర్చ జరగకుండా సమావేశాన్ని వాయిదా వేశారు. రిజిష్టర్‌లో కౌన్సిల్ సభ్యులు సంతకాలు చేసిన అనంతరం ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినందున సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్టు చైర్‌పర్సన్ కటకం నాగకుమారి ప్రకటించారు. తిరిగి సమావేశం ఎప్పుడు ఏర్పాటు చేసేది తరువాత తెలియజేస్తామని ఆమె పేర్కొన్నారు.


చిలకలపూడిలో పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ డీకే బాలాజీ

బందరును సుందర నగరం చేద్దాం : కలెక్టర్

మచిలీపట్నం టౌన్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : పారిశుధ్యాన్ని మెరుగు పరిచి, మచిలీపట్నాన్ని సుందర నగరంగా తీర్చిదిద్దేందుకు ప్రజల భాగస్వామ్యం అవసరమని కలెక్టర్ డీకే బాలాజీ అన్నారు. నాల్గో డివిజన్‌లో వేకువజామునే కలెక్టర్ పర్యటించారు. తడిచెత్త, పొడిచెత్తను వేరు చేయకుండా ఒకే డబ్బాలో వేయడాన్ని చూసి కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. హైనీ హైస్కూలు వద్ద పారిశుధ్య పనులను పరిశీలించి తగిన సూచనలు చేశారు. ద్విచక్ర వాహనంపై కలియతిరిగారు. మూడు స్తంభాల సెంటర్‌లోని అన్న క్యాంటీన్‌ను కలెక్టర్ సందర్శించారు. కలెక్టర్ స్వయం గా టోకెన్‌ను తీసుకున్నారు. మునిసిపల్ కమిషనర్ బాపిరాజుతో కలిసి అల్పాహారం తీసుకున్నారు. పదార్థాల నాణ్యతా లోపం ఉండకూడదన్నారు. క్యాంటిన్ పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవలన్నారు.

విద్యార్థికి కలెక్టర్ కౌన్సెలింగ్

మచిలీపట్నం టౌన్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : పట్టుదల, కృషి ఉంటే విజయం తథ్యమని బాలాజీ హైస్కూల్‌లో తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థి శ్యామ్‌కి జిల్లా కలెక్టర్ బాలాజీ హితవు పలికారు. గాంధీనగర్‌లోని ఉదయపు నడక మిత్ర మండలి భవనంలో యోగ సాధనకు ఆయన సతీమణితో విచ్చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ పక్కన బాలాజీ విద్యాలయం విద్యార్థి సూర్య నమస్కారాలు చేస్తూ మధ్యలో ఆపేస్తూ కన్పించాడు. కార్యక్రమం పూర్తయిన తరువాత కలెక్టర్ విద్యార్థితో మాట్లాడి కౌన్సెలింగ్ ఇచ్చారు.

మహాశివరాత్రి ఏర్పాట్లపై సమీక్ష నేడు

మోపిదేవి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): దక్షిణ కాశీగా ప్రసిద్ధిగాంచిన పెదకళ్లేపల్లి ఫిబ్రవరిలో జరిగే మహాశివరాత్రి ఏర్పాట్లపై 31వ తేదీన దుర్గానాగేశ్వరస్వామి దేవస్థానం ప్రాంగణంలో ఆర్డీవో ఎం. స్వాతి అధ్యక్షతన సమీక్షా సమావేశం నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో దాసరి శ్రీరామ వరప్రసాదరావు గురువారం తెలిపారు. 31వ తేదీ ఉదయం 10 గంటలకు జరిగే ఈ సమావేశానికి మండల స్థాయి అధికారులు విధిగా హాజరుకావాలన్నారు.


గాంధీ చిత్రపటానికి అంజలి ఘటిస్తున్న కలెక్టర్ డీకే బాలాజీ


చల్లపల్లి స్మృతివనం, అవనిగడ్డ గాంధీక్షేత్రంలో గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మండలి

స్ఫూర్తిప్రదాత మహాత్మా గాంధీ

మచిలీపట్నం టౌన్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : మహాత్మాగాంధీ స్ఫూర్తి ప్రదాత అని కలెక్టర్ డీకే బాలాజీ అన్నారు. వర్థంతిని పురస్కరించుకుని గురువారం కలెక్టరేట్‌లో గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గాంధీజీ త్యాగాలను వివరించారు. డీఆర్వో చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు. **పెడన** : అఖిల భారత ఆర్యవైశ్యుల పరిరక్షణ సమితి వ్యవస్థాపకుడు డాక్టర్ కొల్లూరి సత్యనారాయణ (చిన్నా) ఆధ్వర్యంలో గాంధీ వర్థంతి నిర్వహించారు. తొలుత గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. చిట్టూరి పశుపతినాథ్‌బాబు, జవ్వాజి నాగరాజు, కొల్లూరి రాధాకృష్ణ, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు. **గూడూరు** : ఆకులమన్నాడు గ్రామ పంచాయతీ కార్యాలయంలో మహాత్మాగాంధీ వర్థంతి కార్యక్రమం నిర్వహించారు.గాంధీజీ చిత్రపటానికి గ్రామ సర్పంచ్ మహమ్మద్ రఫీ పూలమాల వేసి నివాళులర్పించారు. సచివాలయం, వెలు గు సిబ్బంది పాల్గొన్నారు. **అవనిగడ్డ:** గాంధీక్షేత్రంలో గ్రామీణ యువజన వికాస సమితి నేతృత్వంలో జరిగిన మహాత్మాగాంధీ వర్థంతి కార్యక్రమంలో బుద్ధప్రసాద్ ముఖ్యఅతిధిగా పాల్గొని మహాత్మాగాంధీ విగ్రహానికి నివాళులర్పించారు. గ్రామీణ యువజన వికాస సమితి అధ్యక్షుడు మండలి వెంకట్రామ్, కూటమి నేతలు కొల్లూరి వెంకటేశ్వరరావు, యాసం చిట్టిబాబు, మత్రే గంగయ్య, సిద్ధినేని అశోక్ నాయుడు, పంద్రాజు లంకమ్మ ప్రసాద్, యక్కటి నాగరాజు, ఘంటసాల రాజమోహన రావు, లుక్కా శ్రీనివాసరావు, గుడివాక శివరావు తదితరులు పాల్గొన్నారు. అవనిగడ్డ డిగ్రీ కళాశాలలో మహాత్మాగాంధీ వర్థంతి కార్యక్రమాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ ఉమారాణి నేతృత్వంలో ఎన్ఎస్ఎస్ యూనిట్-2 అధికారి రవిబాబు పాల్గొన్నారు. ఎస్వీఎల్ కళాశాలలో కరస్పాండెంట్ దుట్టా ఉమామహేశ్వరరావు నేతృత్వంలో మహాత్మాగాంధీ వర్థంతి నిర్వహించారు. గ్రామీణ యువజన వికాస సమితి ఆధ్వర్యంలో వ్యాసరచన, దేశభక్తిపాటల పోటీలు నిర్వహించారు. **కోడూరు** : కోడూరు ప్రధాన సెంటర్‌లో గాంధీ విగ్రహానికి తూర్పు కృష్ణా ప్రాజెక్టు కమిటీ చైర్మన్ దేవనబోయిన వెంకటేశ్వరరావు నివాళులర్పించారు. జనసేన పార్టీ అధ్యక్షుడు మత్రే గంగయ్య, కోట రాంబాబు, కాగిత రామారావు, పూతబోయిన సాయిబాబు, పూతబోయిన కరుణకుమార్, వివేక్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు. **చల్లపల్లి** : మహాత్మాగాంధీని ఆదర్శంగా తీసుకుని దేశ సమైక్యతకు కృషిచేయటమే నేటితరం యువత కర్తవ్యం కావాలని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు.చల్లపల్లి గాంధీజీ స్మృతివనంలో గాంధీ వర్థంతి కార్యక్రమం జరిగింది. సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో బుద్ధప్రసాద్ ముఖ్య అతిధిగా పాల్గొని ప్రసంగించారు. గాంధీజీ విగ్రహానికి ఎమ్మెల్యే పుష్పాంజలి ఘటించారు. సర్వమత ప్రార్థనలు చేశారు. ఎంపీపీ విజయ రాధిక, వైస్ ఎంపీపీలు మోర్ల రాంబాబు, పిట్టు వెంకటేశ్వరమ్మ, డీసీ చైర్మన్ దిలీప్‌కుమార్, ఎంపీటీసీ సభ్యులు స్వప్న, శ్రీనివాసరావు, అంకమ్మ, షేక్ నబీఘోరి, మంగళాపురం సర్పంచ్ డొక్కు నాగేశ్వరరావు, యార్లగడ్డ శ్రీనివాసరావు, బోలెం నాగమణి, రావి చిట్టి, చంద్ర వెంకటేశ్వరరావు, మోర్ల శివ, అడపా రాంబాబు, జివి.తాతారావు, హరిగోపాల్, విద్యార్థులు పాల్గొన్నారు. ఆర్యవైశ్య సంఘ భవనంలో గాంధీజీకి నివాళులు అర్పించారు.


ఆకులమన్నాడులో.. పెడనలో.. కోడూరులో..

నిత్యాన్నదాన పథకానికి రూ1,01,116 విరాళం



మోపిదేవి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానంలో జరిగే నిత్యాన్నదాన పథకానికి హైదరాబాద్‌కు చెందిన దాతలు రూ.1,01,116 విరాళం అందజేశారు. ఈ మేరకు విరాళం చెక్కును ఆలయ కార్యనిర్వహణాధికారి దాసరి శ్రీరామ వరప్రసాదరావుకు దాతలు అందజేశారు. దాతలను ఈవో సత్కరించి ప్రసాదాలను అందజేశారు.

వేణుగోపాలస్వామి సేవలో ఆర్డీవో స్వాతి



కోడూరు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : ఆర్డీవో కె.స్వాతి గురువారం మండలంలో పర్యటించారు. హంసలదీవి గ్రామంలోని రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాలస్వామిని దర్శించుకుని ప్రత్యే క పూజలు నిర్వహించారు. హంసలదీవి సముద్రతీరాన్ని సందర్శించారు. తహసీల్దార్ కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. ప్ర భుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూ సర్వే వివరాలను వీఆర్వోలను అడిగి తెలుసుకున్నారు. రేషన్ బియ్యం, ఇసుక అక్రమ రవాణా చేసేవారిపైచర్యలు తీసుకుంటామన్నారు. తహసీల్దార్ శ్రీను నాయక్, ఆర్ఐ సుభాషిణి, వీఆర్వోలు, సిబ్బంది పాల్గొన్నారు.



వైభవంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం

అవనిగడ్డ రూరల్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): పులిగడ్డ అలివేలు మంగ రాజ్యలక్ష్మి సమేత వేంకటేశ్వరస్వామి దేవాలయంలో కమిటీ సభ్యులు మండలి భావన్నారాయణ నేతృత్వంలో స్వామి వారి కల్యాణాన్ని అర్చకులు విఖనస వైభవంగా జరిపారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారి కల్యాణాన్ని తిలకించి తరించారు. ఆలయ అర్చకులు అగ్నిహోత్రం ధన్వంతరాచార్యుల భక్తులకు అవసరమైన ఏర్పాట్లు పర్యవేక్షించారు. పంచాయతీ ఉపసర్పంచ్ మండలి వెంకటేశ్వరరావు, జనసేన నాయకులు మండలి వెంకటశేషగిరిరావు తదితర ప్రముఖులు పాల్గొన్నారు.


నిత్యావసర సరుకులు అందజేస్తున్న ఎమ్మెల్యే మండలి, తుమ్మల సత్యంబాబు

టీజీఆర్ ట్రస్ట్ సేవలు ప్రశంసనీయం

ఘంటసాల, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): టీజీఆర్ ట్రస్ట్ సేవలు ప్రశంసనీయమని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. శ్రీకాకుళం గ్రామంలో ట్రస్ట్ ఆధ్వర్యంలో 200 పేద కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.3 వేలు విలువైన బియ్యం, నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. బేతేలు మినిస్ట్రీస్ ఆఫ్ ఇండియా వ్యవస్థాపక అధ్యక్షుడు రెవరెండ్ చలపాటి ఏలీషాబాబు పర్యవేక్షణలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ తుమ్మల సత్యంబాబు, సర్పంచ్ ముప్పనేని రవి ప్రసాద్, ఎంపీటీసీ సభ్యులు తాడికొండ వెంకటేశ్వరరావు, జనసేన మండల ప్రధాన కార్యదర్శి సుగ్గన పవన్ కుమార్, కొండవీటి కృష్ణమూర్తి, కోటి, టీడీపీ నాయకులు దానం రామకృష్ణ, పాస్టర్ చలపాటి ప్రసాద్, కూటమి నాయకులు పాల్గొన్నారు. **అవనిగడ్డ రూరల్** : రేగుల్లంక గ్రామంలో సర్పంచ్ దాసరి విజయ్ కుమార్ ఆధ్వర్యంలో టీజీఆర్ చారిటబుల్‌టస్ట్ చైర్మన్ తుమ్మల సత్యం, సభ్యులు నున్న శ్యామ్ కుమార్, సభ్యులు 200 కుటుంబాలకు బియ్యం, నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఇస్మాయిల్, ఉపసర్పంచ్ మండలి వెంకటేశ్వరరావు, మండలి దినేష్ పాల్గొన్నారు.


పల్లపాటి సుబ్రహ్మణ్యానికి టీడీపీ శాశ్వత సభ్యత్వ పత్రాన్ని అందజేస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర

కార్యకర్తలకు టీడీపీ భరోసా

మచిలీపట్నం టౌన్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): టీడీపీ కార్యకర్తలు క్రమశిక్షణకు మారుపేరని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. 49వ డివిజన్‌లోని నారాయణపురం ఎస్టీ కాలనీలో నూరు శాతం సభ్యత్వం పూర్తయిన సందర్భంగా ముఖ్య అతిధిగా పాల్గొన్నారు.

లక్ష రూపాయలు శాశ్వత సభ్యత్వం తీసుకున్న టీడీపీ మాజీ మునిసిపల్ ఫ్లోర్ లీడర్ పల్లపాటి సుబ్రహ్మణ్యానికి పార్టీ సభ్యత్వ పత్రం అందజేశారు. యానాదులతో కలిసి సహపంక్తి భోజనాలు చేశారు. కష్టపడి పనిచేసిన కార్యకర్తలకు ఎప్పుడూ తగిన గుర్తింపు లభిస్తుందన్నారు. టీడీపీ నాయకులు గనిపిశెట్టి గోపాల్, ఎండి ఇలియాస్, పిప్పళ్ళ కాంతారావు, గండికోట అంజిబాబు, బత్తిన దాసు, పి.వి.ఫణికుమార్, పల్లపాటి అభినవ్, ఆళ్ల మాధవ, పాల పద్మ, లంకిశెట్టి నీరజ తదితరులు పాల్గొన్నారు.

కుటుంబం చెంతకు బంగ్లాదేశీ

నాగాయలంక, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : బంగ్లాదేశ్‌కు చెందిన మహమ్మద్ ముస్లిం ఉద్దీన్ అలియాస్ బిస్వాస్‌ను 2013లో నాచుగుంటలో గుర్తించి కోర్టులో హాజరుపర్చారు. కోర్టు రెండు సంవత్సరాల జైలు శిక్ష విధించింది. రాజమండ్రి సెంట్రల్ జైలు నుంచి అతడిని నాగాయలంక పోలీస్ స్టేషన్‌కు పంపించారు. ఎస్సైలు సుబ్రహ్మణ్యం, కె.రాజేష్ అతని కుటుంబసభ్యుల వివరాలు తెలుసుకుని దశాబ్దం అనంతరం కుటుంబ సభ్యుల వద్దకు పంపారు.


లొల్లా కుటుంబశాస్త్రిని సత్కరిస్తున్న రవీంద్ర

బ్రాహ్మణులకు అండగా ఉంటా

మచిలీపట్నం టౌన్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : పేద బ్రాహ్మణులకు అండగా ఉంటామని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ అర్చక పురోహిత సంక్షేమ సేవా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన లొల్లా కుటుంబశాస్త్రిని ఆయన సత్కరించారు. వేమూరి నాగసాయి శర్మ, చిత్రపు లీల, కె. రాము, జొన్నలగడ్డ శ్రీనివాస్, రేమాని రామశర్మ, పి.వి. ఫణికుమార్ పాల్గొన్నారు.

ఆక్వా మందుల షాపుల తనిఖీ

నాగాయలంక, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఆక్వా మందుల షాపులను టాస్క్‌ఫోర్స్ కమిటీ గురువారం తనిఖీ చేసింది. ఆక్వా మందులు, మేతలకు సీఏఏ రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా ఉండాలని, ఆక్వా షాపులకు ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఆక్వా కల్చర్ డెవలప్‌మెం ట్ అథారిటీ రిజిస్ట్రేషన్ ఉండాలని తెలిపారు. గడువు ముగిసిన ఉత్పత్తులను అమ్మరాదని వ్యాపారులకు సూచించారు. ఈ తనిఖీల్లో అవనిగడ్డ మత్స్యశాఖ సహాయ సంచాలకులు ఆర్.ప్రతిభ, మచిలీపట్నం డ్రగ్ ఇన్‌స్పెక్టర్, ఎంపెడా విజయవాడ టెక్నికల్ అసిస్టెంట్, వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

రేషన్ బియ్యం స్వాధీనం

● ముగ్గురి అరెస్టు

కోడూరు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని ఎస్సై చాణిక్య అదుపులోకి తీసుకున్నారు. ఉల్లిపాలెం - భవానిపురం వారధిపై ప్రత్యేక నిఘా ఉంచి ఆటోలో తరలిస్తున్న తొమ్మిది క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. రవాణా చేస్తున్న మద్దంశెట్టి దుర్గారావు, కరణం శ్రీనివాస్, యడవల్లి శ్రీనులను అదుపులోకి తీసుకున్నారు. స్వతంత్రపురం రేషన్ డీలర్ బొప్పన రమాదేవి, స్వతంత్రపురం జిల్లా పరిషత్ పాఠశాల వంట మనిషి చెక్క వెంకట నారాయణ వద్ద బియ్యం కొనుగోలు చేసినట్లు నిందితులు తెలిపారు. వీరికి సహకరించిన పెదసింగు రాంబాబు, చిట్టిప్రోలు సుబ్బారావులపై కూడా కేసు నమోదు చేసినట్లు ఎస్సై చాణిక్య తెలిపారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

పెడన రూరల్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): మండల, గ్రామ సమైక్య కలల నిర్మాణం అంశంపై గ్రామ, మండల సమైక్య సంఘాల అధ్యక్ష కార్యదర్శులకు మూడు రోజుల శిక్షణ తరగతులు నిర్వహించారు. మండలంలోని 43 గ్రామ సమైక్యల ప్రతినిధులు పాల్గొన్నారు. మ హిళలు ఆర్థికంగా బలోపేతం అయ్యేందుకు తీసుకోవాల్సిన విధానాలను రీసోర్స్ పర్సన్లు కె.వై.దాసు, ఏపీఎం శ్రీదేవి వివరించారు. సీసీలు ఎ వెంకటేశ్వర్లు, పి.సుజాత, ఎం.తులసీబాల, సమైక్య ప్రతినిధులు పాల్గొన్నారు.

సోలార్ కిట్ల పంపిణీ

అవనిగడ్డ రూరల్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన సూర్యఘర్ పథకం కింద ఎల్ఈడీ లైట్లను గురువారం పులిగడ్డ పంచాయతీకి పంపిణీ చేశారు. మండలి శేషగిరిరావు మాట్లాడుతూ సూర్యఘర్ పథకంలో పులిగడ్డను పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి ఐదు ప్రాంతాల్లో ఏర్పాటు చేయటం హర్షణీయమన్నారు.



మినుము పంట పరిశీలన

మోపిదేవి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రానికి చెందిన శాస్త్రవేత్తల బృందం గురువారం కప్తానుపాలెంలో మినుము పంటను పరిశీలించారు. కో-ఆర్డినేటర్ డా.సుధారాణి, శాస్త్రవేత్తలు మినుము పంటను పరిశీలించారు. లద్దె పురుగు నివారణకు వేపనూనె సంబంధిత మందులను పిచికారీ చేయాలన్నారు. పురుగు అధికంగా ఉన్నట్లైతే క్లోరాంట్రానిలిప్రోల్ 60 మిల్లీలీటర్లు లేదా ఇమామిథిన్ బెంజెయెట్ 80 మిల్లీ గ్రాములను ఎకరానికి పిచికారి చేయాలని సూచించారు. బూడిద తెగులు నివారణకు హెక్సాకొనజోల్ 400 మిల్లీలీటర్లు పిచికారీ చేయాలన్నారు. శాస్త్రవేత్త డాక్టర్ ఎం.వెంకటలక్ష్మి, రైతులు పాల్గొన్నారు.

చర్చి వేడుకలకు విరాళం

నాగాయలంక, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : బ్రహ్మానందపురంలో చర్చి వార్షిక వేడుకలకు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ నేత బొబ్బా గోవర్ధన్ రూ.5 వేలు విరాళం అందజేశారు. అన్నవితరణ కార్యక్రమానికి బొబ్బా గోవర్ధన్ తనవంతుగా మాజీ జడ్పీటీసీ సభ్యుడు కొల్లూరి వెంకటేశ్వరరావు, గ్రామ పార్టీ అధ్యక్షుడు తానంకి చంటి ద్వారా కొల్లూరు ఇమ్మానియేల్‌కు రూ.5 వేలను అందజేశారు.

స్వయం ఉపాధి శిక్షణ

మచిలీపట్నం టౌన్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : స్వయం ఉపాధితో యువత ఎదగాలని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. జవ్వారుపేటలో స్వయం ఉపాధి శిక్షణ తరగతులను మంత్రి కొల్లు రవీంద్ర ప్రారంభించారు. మగ్గం వర్క్స్, కుట్టు శిక్షణ, ఎరోబిక్స్, బ్యూటీషియన్ కోర్సు ల్లో శిక్షణా తరగతులు ప్రారంభించారు.

దొంతులమ్మ వార్షికోత్సవం రేపు

మచిలీపట్నం టౌన్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : దొంతులమ్మ అమ్మవారి 93వ వార్షికమహోత్సవాలను విజయవంతం చేయాలని మంత్రి కొల్లు రవీంద్ర కోరారు. ఫిబ్రవరి 1 నుంచి 15 రోజుల పాటు నిర్వహించే దొంతులమ్మ వార్షిక మహోత్సవ వాల్‌పోస్టర్లను మంత్రి ఆవిష్కరించారు. పాలకవర్గ అధ్యక్షుడు సైకం రఘువర్మ, కార్యదర్శి రామయ్య, కోశాధికారి కొల్లు రంగనాయకులు పాల్గొన్నారు.

ఆదివనమలమ్మ విగ్రహ ప్రతిష్ఠ 3న

మచిలీపట్నం టౌన్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : నిజాంపేటలో వేంచేసియున్న విజయ వనమలమ్మ విగ్రహాన్ని గురువారం నగరవీధుల్లో ఊరేగించారు. ఫిబ్రవరి 3న విగ్రహాలను ప్రతిష్ఠించనున్నారు. శుక్రవారం వాస్తుహోమం, శనివారం విగ్రహాలకు క్షీరాధివాసం, ఆదివారం మంటపారాధన, దీక్షా హోమాలు జరగనున్నాయి.

మత్స్యకార నేతల కృతజ్ఞతలు

నాగాయలంక, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : పాత ఉపకాలికి చెందిన కోలా నాంచారయ్య మృతదేహాన్ని సముద్రంలో గాలించేందుకు సహకరించిన రెవెన్యూ, మత్స్యశాఖ, పోలీసు, మెరైన్ ఇతర ప్రభుత్వ శాఖల అధికారులకు ఏపీ సంప్రదాయ మత్స్యకారుల సేవా సమితి ప్రధాన కార్యదర్శి లకనం నాగాంజనేయులు, జిల్లా మత్స్యశాఖ సహకార సంఘం డైరెక్టర్ కర్రి కృష్ణమూర్తి కృతజ్ఞతలు తెలిపారు. తహసీల్దార్ ఎం.హరనాథ్‌ను గురువారం ప్రత్యేకంగా కలసి కృతజ్ఞతలు తెలిపారు. నాగిడి పోతురాజు, ఏఎస్ఐ గణేష్ పాల్గొన్నారు.

టీఎన్‌యూఎస్ క్యాలెండర్ ఆవిష్కరణ

చల్లపల్లి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం క్యాలెండర్‌ను ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ గురువారం చల్లపల్లిలో ఆవిష్కరించారు. ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కైతేపల్లి దాస్, జిల్లా అధ్యక్షుడు నరసింహారావు, సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, వైస్ ఎంపీపీ మోర్ల రాంబాబు, నేతలు అడపా రాంబాబు, దిరిశం వెంకట్రావు పాల్గొన్నారు.